TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

సంపుటి : 3 సంచిక : 253 | ఆదివారం 06-09-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ మౌనిక | పేజీలు : 8 | వెల 3 /-

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ...? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9000281049

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

ఝిరాం వ్యాలీలో మావోయిస్టుల

## దాడి కేసు..

**10మందిని దోషులుగా తేల్చిన కోర్టు**



- 2013లో ఛత్తీస్‌గఢ్ బస్తర్‌లో ఘటన
- కాంగ్రెస్ పరివర్తన్ ర్యాలీపై మావోయిస్టుల మెరుపుదాడి
- 29 మంది మృతి.. 30 మందికి గాయాలు
- కాంగ్రెస్ రాష్ట్ర అగ్ర నాయకత్వానికి తీవ్ర నష్టం

మిగతాది 2లో



## జమ్మూకశ్మీర్‌లో లష్కరే కమాండర్ హతం

- లష్కరే కమాండర్ యాసిర్ హతం
- యూస్‌మార్గ్‌లో భద్రతాబలగాల కాల్పులు
- నిఘా పెట్టి ఉగ్రవాదిని గుర్తింపు
- ఎదురు కాల్పుల్లో యాసిర్ మృతి
- పహల్గాం ఉగ్రవాదులతో సంబంధాలు
- పూంఛ్ దాడిలో ప్రమేయం
- సోనామార్గ్ దాడిలోనూ పాత్ర
- బోటా పత్రి దాడిలో ప్రమేయం
- వారం రోజులుగా భద్రతాబలగాల మాటు
- మిగతా ఉగ్రవాదుల కోసం గాలింపు కొనసాగింపు

మిగతాది 2లో

# మోదీ తెలివైన వారు..

## ఆయన చెప్పినట్లు చేయాలి: బెల్జియం ప్రధాని

- మోదీ చాలా తెలివైన నేత
- ప్రపంచంలో స్ఫూర్తిదాయక నాయకుడు
- ఆయన మాటలు ఆచరించాలనిపిస్తాయి
- భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది
- ప్రపంచంలో భారత్ పాత్ర కీలకం
- భారత్ విశ్వసనీయ భాగస్వామి
- భారత్‌తో బంధాలు బలోపేతం చేస్తాం
- ట్రంప్ సుంకాలపై పరోక్ష విమర్శ
- స్వేచ్ఛా మార్కెట్లతోనే అభివృద్ధి



మిగతాది 2లో

## కల్వకుంట్ల కుటుంబమా.. కాస్కోండి..:

# సీఎం రేవంత్ సవాల్



- బీఆర్‌ఎస్‌పై సీఎం రేవంత్ తీవ్ర విమర్శలు
- తెలంగాణను దోచుకున్నారని ఆరోపణ
- రైతులకు రూ.36 వేల కోట్లు ఇచ్చాం
- ఏడాదిలో 70 వేల ఉద్యోగాల భర్తీ
- 1.06 కోట్ల రేషన్ కార్డుల పంపిణీ
- 3.48 కోట్ల మందికి సన్నబియ్యం
- కేసీఆర్ అసెంబ్లీకి రావాలని సవాల్
- లేదంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్
- గజ్వేల్‌లో తేల్చుకుందామని వ్యాఖ్య
- సిరిసిల్ల, సిద్దిపేటలో కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా

నకిరేకల్: బీఆర్‌ఎస్ అన్ని రకాలుగా రాష్ట్రాన్ని ముంచి గద్దె దిగిపోయిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి (=వఋుత్ష్ర =వ౨౨ఎ) విమర్శించారు. ప్రజా ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న వారి చరిత్రను ప్రజలు గమనించాలని కోరారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. 100 పడకల ఆస్పత్రిని సీఎం ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని రాజీవ్‌గాంధీ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

బందిపోట్లలా తెలంగాణను దోచుకున్నారు

"బీఆర్‌ఎస్ నేతలు తెలంగాణను బందిపోటుల్లా దోచుకున్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులు అనేక రకాలుగా మోసపోయారు. చివరి విడత రైతు భరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారు. బీఆర్‌ఎస్ ఎగవేసిన రూ.36వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం. మా ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. నల్గొండ జిల్లాకు మూడు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చాం. కేసీఆర్ సీఎం అయితే వారి కుటుంబసభ్యులకు పదవులు ఇచ్చారు. మా ప్రభుత్వంలో

మిగతాది 2లో

సాంకేతికత ఎంత పెరిగినా టీచర్‌కు

## ప్రత్యామ్నాయం లేదు




విజయవాడ: సాంకేతికత ఎంత పెరిగినా టీచర్‌కు ప్రత్యామ్నాయం లేదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సమాజంలో గొప్ప వ్యక్తులంతా ఉపాధ్యాయుల చేతుల్లో ఎదిగిన వాళ్లేనని చెప్పారు. విజయవాడలోని 'ఎ' కన్వెన్షన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవంలో సీఎం పాల్గొన్నారు. తొలుత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం మాట్లాడారు.

### ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. పీఆర్సీకి సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్

"1991 నుంచి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఎక్కడికక్కడ పోటీతో పాటు అవకాశాలు పెరిగాయి. టెక్నాలజీతో మంచి చెడు రెండూ ఉన్నాయి. నేటి కాలంలో బోధనా విధానం పూర్తిగా మారింది. మా చిన్నప్పుడు టీచర్లు బాగా కొట్టేవారు. భయభక్తులతో చదువుకునే వాళ్లం. టీచర్‌తో దెబ్బలు తిన్నవారంతా బాగుపడతారు. పిల్లల మానసిక స్థితి మారుతోంది.. టీచర్లు గమనించాలి. మారుతున్న సాంకేతికత పిల్లలలపై పెను ప్రభావం చూపిస్తోంది. సామాజిక మాధ్యమాలు పిల్లలకు శాపంగా మారాయి.

మిగతాది 2లో

## పీసీబీ కొరడా..

### ఆంధ్రా పేపర్ మిల్లుకు భారీ జరిమానా




అమరావతి: రాజమహేంద్రవరంలోని ఆంధ్రా పేపర్ మిల్లుకు ఏపీ ప్రభుత్వం భారీ జరిమానా విధించింది. రూ.21.01 కోట్ల జరిమానా విధిస్తూ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఆదేశాలు జారీ చేసింది. లోపాలు సరిదిద్దడంలో విఫలం కావడం, నిబంధనల్ని పదేపదే ఉల్లంఘించడంతో పీసీబీ కొరడా ఝుళిపించింది. గోదావరి నది పరిసరాల్లో వ్యర్థాలు విడుదల చేస్తున్నందుకు ఈ భారీ జరిమానా వేసింది. నిబంధనలు ఉల్లంఘించినందుకు ఆంధ్రా పేపర్ మిల్లుపై కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం పవన్ ఇటీవల హెచ్చరించారు.

2029లోగా ఏపీలో మరో

## మూడు డీఎస్సీలు



మిగతాది 2లో

## భూములు దోచుకోవడానికే 22ఏ తీసుకొచ్చారు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



- 22ఏపై కిషన్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు
- భూములు దోచుకోవడానికే 22ఏ తెచ్చారని వ్యాఖ్య
- ప్రభుత్వ లక్ష్యం భూములు అమ్ముడమేనని ఆరోపణ
- ధరణితో బీఆర్‌ఎస్ భూములు దోచుకుందన్న విమర్శ
- అనుమతులున్న భూములనూ 22ఏలో పెట్టారని ఆరోపణ
- 60 లక్షల ఎకరాలకు పైగా భూములు 22ఏలో ఉన్నాయని వెల్లడి

మిగతాది 2లో

TGTEL/25/A0827
ప్రజా దివాస్
తెలుగు దినపత్రిక
06-09-2026

# సంపాదకీయం

## సార్థక నామధేయుడు పూల సుబ్బయ్య

పేరుకు తగ్గట్టుగానే సార్థక నామధేయుడు కీ.శే. పూల సుబ్బయ్య. ఇంటి పేరులో పరిమళాన్ని, తన పేరులోని మంచితనాన్ని నింపుకున్న నాయకుడు. ఎవరీ పూల సుబ్బయ్య? ఆయనకు, వెలిగొండ ప్రాజెక్టుకు ఉన్న సంబంధం ఏమిటి? ఆ ప్రాజెక్టుకు ఆయన పేరు ఎందుకు పెట్టారు?.. అనే విషయాలు చాలా మందికి తెలియవు. 1929 జూన్ 29న ఉమ్మడి ప్రకాశం జిల్లా కంభంలో ఓ సాధారణ కుటుంబంలో సుబ్బయ్య జన్మించారు. 1946--1949లో గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. న్యాయవాదిగా కొంతకాలం పనిచేశారు.

అప్పట్లో నల్లమల అటవీ ప్రాంతానికి చెందిన కంభం, మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి ప్రాంతాల్లో వామపక్ష పార్టీలు బలంగా పనిచేసేవి. గిరిజనుల సమస్యలపై గొలుసుకట్టు ఉద్యమాలు జరిగేవి. 1949లో విద్యార్థి దశలోనే ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘంలో సుబ్బయ్య చురుకైన పాత్ర పోషించారు. పార్టీకి చెందిన పలు హోదాల్లో పనిచేశారు. 1962, 1967 శాసనసభ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థిగా యర్రగొండపాలెం (అప్పట్లో కర్నూలు జిల్లా) నుంచి గెలుపొందారు. 1978లోనూ మార్కాపురం నుంచి మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

ప్రకాశం జిల్లా పూర్తిగా వెనుకబడిన ప్రాంతం. సాగు, తాగునీరు లేక గ్రామాలన్నీ కరవు కోరల్లో చిక్కుకునేవి. వెయ్యి అడుగుల లోతులో కూడా నీరు పడేది కాదంటే పరిస్థితి ఎంత భయానకంగా ఉండేదో మనం అర్థం చేసుకోవచ్చు. దీనికి తోడు భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ అధికంగా ఉండేది. ఈ అంశాలన్నింటినీ అధ్యయనం చేసిన సుబ్బయ్య.. ప్రకాశంను కరవు రహిత జిల్లాగా మార్చాలంటే కృష్ణా జలాలను ఆ ప్రాంతానికి తీసుకురావడం ఒక్కటే ఏకైక మార్గంగా భావించారు. ఇదొక సాహసోపేతమైన ప్రాజెక్టు. నల్లమల టైగర్ ఫారెస్ట్‌లోని కొండలను తొలిచి సొరంగాలు ఏర్పాటు చేస్తేనే సాధ్యం.

ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రజల మద్దతుతో సుబ్బయ్య ఉద్యమించారు. దీంతో ఈ వెలిగొండ ప్రాజెక్టు ప్రతిపాదనలకు మొదట స్వర్గీయ ఎన్టీఆర్ ఆమోదం తెలిపారు. ఆయన నిర్ణయానికి కొనసాగింపుగా 1996 మార్చి 5న నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అనంతరం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా వెలిగొండ పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. అదే సమయంలో కమ్యూనిస్టు పార్టీల ప్రజాప్రతినిధులంతా వైఎస్‌ను కలిశారు. వెలిగొండ ప్రాజెక్టు కోసం ఎంతగానో ఉద్యమించి, ఆ క్రమంలోనే అసువులు బాసిన పూల సుబ్బయ్య పేరును ఆ ప్రాజెక్టుకు పెట్టాలని వైఎస్‌ను కోరగా, అందుకు ఆయన అంగీకరించారు.

2014--2019 వరకు చంద్రబాబు పోలవరం పనులతో పాటు వెలిగొండ పనులనూ పరుగులు పెట్టించారు. పలుమార్లు ప్రాజెక్టు పనులను సందర్శించారు. 2019--2024 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రాజెక్టు పనులను పూర్తి స్థాయిలో పూర్తిచేయలేకపోయారు. 'వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేసి, 2024 ఎన్నికల్లో ఓట్లు అడుగుతాను' అన్న మాట తప్పి, నీళ్లు రాకుండానే, ఎకరం నేల కూడా తడవకుండానే ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని 'రక్తి' కట్టించారు. 2024లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు పూర్తి స్థాయిలో రెండు సొరంగ మార్గాలను పూర్తి చేసి, అన్ని అవరోధాలనూ అధిగమించి, 2026 ఆగస్టు 31వ తేదీన ఆ మహాస్వప్నాన్ని సాకారం చేశారు. కృష్ణా నీళ్లతో ఆ ప్రాంతాన్ని తడిపి, ఆ ప్రాజెక్టును తెలుగు ప్రజలకు అంకితం ఇచ్చారు.

ఇక్కడ చిన్న లెక్క చెప్పాలి. వైఎస్సార్, వైఎస్ జగన్ హయాంలో ప్రాజెక్టు పనుల కోసం రూ.2,175 కోట్లు ఖర్చు పెట్టారు. ఆయా సందర్భాలలో పనిచేసిన ముఖ్యమంత్రులు రూ.2,417 కోట్లు ఖర్చు పెట్టారు. చంద్రబాబు హయాంలో రూ.3,256 కోట్లు ఖర్చు పెట్టారు. మరో రూ.1906 కోట్ల ఖర్చుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అంటే మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.10,200 కోట్లు కాగా, చంద్రబాబు హయాంలో రూ.5,662 కోట్ల ఖర్చు జరిగిందని అధికారుల అంచనా. ఏ ప్రాజెక్టు నిర్మాణమైనా ఏడాదికో, ఐదేళ్లకో పూర్తి కాదు. ఏ అభివృద్ధి పనులనైనా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు వివక్షకు తావులేకుండా కొనసాగించాలి.

వెలిగొండ ప్రాజెక్టు పూర్తి నీటినిల్వ సామర్థ్యం 53.85 టీఎంసీలు. 4.47లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందించడం ప్రాజెక్టు లక్ష్యం. కాగా తొలి విడతలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందనుంది. ప్రజాప్రతినిధి అన్న పదాన్ని సార్థకం చేసుకొని, తాను పుట్టి పెరిగిన ప్రాంతానికి కృష్ణా జలాలను తీసుకుని వచ్చేందుకు సుబ్బయ్య చేసిన కృషి మహోన్నతమైనది.

## ప్రజలను ఇబ్బందిపెట్టేలా ఏపీ పేపర్‌మిల్లు వ్యవహరిస్తోంది: కందుల దుర్గేష్



రాజమహేంద్రవరం: కూటమి ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటుంటే.. రాజమహేంద్రవరంలోని ఏపీ పేపర్ మిల్లు మాత్రం ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తోందని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజమహేంద్రవరంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ఈ ప్రాంతాన్ని దుర్గంధభరితం చేస్తూ.. పట్టణాలు, గ్రామాలకు స్వచ్ఛ జలాలు ఇవ్వకుండా చేస్తున్న విధానాన్ని పేపర్ మిల్లు సరిచేసుకోకపోతే ప్రజా ఉద్యమం తప్పదన్నారు. అందుకు తామే నాయకత్వం వహించినా ఆశ్చర్యం అవసరంలేదన్నారు.

మే నెలలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేపర్ మిల్లు వ్యర్థ జలాలు కలిసే ప్రాంతాన్ని కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో కలిసి పరీక్షించి ఏ స్థాయిలో జల కాలుష్యం జరుగుతుందో బహిర్గతం చేశారన్నారు. ప్రజల జీవితాలతో చెలగాటమాడే పేపర్‌మిల్లు తరహా పరిశ్రమల తీరును ఎండగడతామన్నారు. పన్నులు చెల్లించకుండా న్యాయవివాదాలతో కాలయాపన చేస్తున్నారని, కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టడంలో దారుణంగా విఫలమయ్యారని మండిపడ్డారు. అలానే కడియంలోని పేపర్‌మిల్లు 70 మంది కార్మికులను రోడ్డున పడేసిందని దుయ్యబట్టారు. ఉప ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపు మేరకు స్వచ్ఛగోదావరి సాధనకు తామంతా పోరాడుతామని స్పష్టం చేశారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారిని దర్శించుకుని, వాహన సేవలను  తిలకించేలా పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తితిదే సీవీఎస్‌వో మురళీకృష్ణ తెలిపారు. తిరుమల నాలుగు మాడ వీధులతోపాటు ఇతర ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై శనివారం తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీఎస్‌వో మాట్లాడుతూ, గత బ్రహ్మోత్సవాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి తితిదే విజిలెన్స్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో పకడ్బందీ భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వాహన సేవలను తిలకించేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

### ధ్వజారోహణానికి ప్రత్యేక బందోబస్తు

శ్రీవారి బ్రహ్మోత్సవాల ధ్వజారోహణం రోజున సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో పటిష్ఠమైన బందోబస్తు, బ్యారికేడింగ్ తదితర ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో భద్రతా చర్యలు చేపడుతున్నామన్నారు.

## కల్వకుంట్ల కుటుంబమా.. కాస్కోండి..:

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 1.06 కోట్ల రేషన్‌కార్డులు ఇచ్చాం. 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. బీఆర్ఎస్ కార్యకర్తలకూ వాటిని అందిస్తున్నాం. వారి ఇళ్లలో ఉచిత కరెంట్ వస్తోందంటే మా ప్రభుత్వం కృషి కాదా?మేం ఇచ్చిన రైతుభరోసా నిధులను ఎవరైనా బీఆర్ఎస్ కార్యకర్తలు తీసుకోలేదా?పేదలకు సహాయం చేసినందుకు ఇందిరమ్మ పాలన పోవాలా?"

### కేసీఆర్ సభకు రావాలి.. లేదంటే రాజీనామా చేయాలి

"సంపాదన పోయిందని బావ, బామ్మర్ది ఏడుస్తున్నారు. నాకు చదువు లేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. చదువు లేకపోయినా సంస్కారం ఉంది. అందుకే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. నాకు సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నా. ఎక్కడ ఆస్తి ఇవ్వాల్సి వస్తుందోనని చెల్లిని బయటకు గెంటేశారు. నాలుగు ఇంగ్లీష్ ముక్కలు వస్తే సరిపోదు.. ఆడబిడ్డను చూసుకోవాలి. మీ సంస్కారం ఏంటో.. నా సంస్కారం ఏంటో అసెంబ్లీకి రండి.. చూసుకుందాం. రాసిపెట్టుకోండి.. మీకు భవిష్యత్ లేదు. మీ బతుకులు చీకటిమయమే. రేవంత్ ఉన్నంతకాలం.. బీఆర్ఎస్ అనే మొక్కను ఎదగనివ్వం. తెలంగాణ తులసి వనంలో గంజాయి మొక్కను పీకుతాం. కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా. వచ్చేసారి సిరిసిల్ల, సిద్దిపేటలోనూ కాంగ్రెస్ గెలుస్తుంది. ఈనెలాఖరుకు సిరిసిల్ల వెళ్తాం. వచ్చేనెల సిద్దిపేటపై దండయాత్ర చేస్తాం. బావ బావమరుదులు ఎవరిని తెచ్చుకుంటారో తెచ్చుకోండి. వచ్చే ఎన్నికల నాటికి సీట్లు పెరిగితే 117, ప్రస్తుతం ఉన్నవే కొనసాగితే 90 స్థానాలతో కాంగ్రెస్ విజయం సాధిస్తుంది. కేసీఆర్ అసెంబ్లీకి రావాలి. లేదంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే గజ్వేల్‌లోనే తేల్చుకుందాం" అని రేవంత్ సవాల్ విసిరారు.

## భూములు దోచుకోవడానికే 22ఏ తీసుకొచ్చారు:

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం భూములు అమ్మడమేనని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ మాదిరిగానే ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి  సైతం భూములను అమ్మే ప్రయత్నం చేస్తున్నట్లు దుయ్యబట్టారు. నిషేధిత భూసమస్యలపై ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద భాజపా ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. "కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చి దోచుకుంటోంది. భూములు దోచుకోవడానికే 22ఏ తీసుకొచ్చారు. 22ఏ కింద తమ భూములు ఉన్నాయని చాలామందికి తెలియదు. ధరణి పేరుతో బీఆర్ఎస్  ప్రభుత్వం ఎలా దోచుకుందో అందరికీ తెలుసు. రాష్ట్రాన్ని స్థిరాస్తి వ్యాపారంగా మార్చారు. అన్ని రకాల అనుమతులు ఉన్న భూములను 22ఏ జాబితాలో పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం భూములు అమ్మడమే. భూములు అమ్మకపోతే ప్రభుత్వం నడవలేని పరిస్థితి ఉంది.

### రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ క్షీణించిపోయింది: రామచందర్ రావు

వక్ఫ్‌భూములపై తప్ప అన్ని భూములపై సీఎం రేవంత్ కన్నేశారు. రాష్ట్రాన్ని ఆర్ఆర్ రియల్ ఎస్టేట్ సంస్థగా మార్చారు. ఉద్యోగులకు జీతాలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేని పరిస్థితికి తెచ్చారు. 60 లక్షల ఎకరాలకు పైగా భూమిని 22ఏలో పెట్టారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రజాస్వామ్యం ఉందా?కాంగ్రెస్ నాయకులను, అధికారులను హెచ్చరిస్తున్నా.. మీరు దోచుకున్న ప్రతి రూపాయి వసూలు చేసి ప్రజలకు పంచుతాం. బీఆర్ఎస్ మాదిరిగా కాంగ్రెస్ కూడా 30 శాతం కమీషన్ అడుగుతోంది. కమీషన్ల కోసమే ప్రజల భూములను నిషేధిత జాబితాలో పెట్టారు. రానున్న రోజుల్లో 22ఏపై ఇంటింటికీ వెళ్లాలి.. రేవంత్ ప్రభుత్వంపై పోరాటం చేయాలి. 22ఏలో పెట్టిన పేదల భూములను తొలగించాలి" అని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## 2029లోగా ఏపీలో మరో మూడు డీఎస్సీలు

మొదటిపేజీ తరువాయి

విజయవాడ: డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియనివారు తమపై విమర్శలు చేస్తున్నారని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. విజయవాడ ఏ కన్వెన్షన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవంలో లోకేశ్ మాట్లాడారు. "కాయలున్న చెట్టుకే రాళ్లదెబ్బలు తగులుతాయి. 14 డీఎస్సీలు వేసిన వ్యక్తి సీఎం చంద్రబాబు. మా ప్రభుత్వాల హయాంలో 2 లక్షల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. మా ప్రభుత్వంలో ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం. 2029లోగా మరో మూడు డీఎస్సీలు వస్తాయి.

పిల్లలను గొప్పవాళ్లుగా తయారు చేసే అద్భుతమైన అవకాశం టీచర్లకే ఉంది. రాష్ట్ర విద్యా వ్యవస్థలో సంస్కరణలు తెచ్చేందుకు కట్టుబడి ఉన్నాం. టీచర్లను విదేశాలకు పంపిస్తున్నాం. అక్కడ స్టడీ చేసి రావాలని కోరుతున్నాం. ప్రాక్టికల్ విద్య అందిస్తేనే పిల్లలు అద్భుతాలు చేస్తారు. విద్యాశాఖలో ఏపీ మోడల్ మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండాలి. గత ప్రభుత్వం 117 జీవో తెచ్చి పిల్లలను పాఠశాలలకు దూరం చేసింది. నేటి కాలానికి అనుగుణంగా పాఠశాల సిలబస్ మారుస్తున్నాం" అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

## సాంకేతికత ఎంత పెరిగినా టీచర్‌కు ప్రత్యామ్నాయం లేదు

మొదటిపేజీ తరువాయి

పిల్లల్లో కుటుంబ విలువలు, నైతిక ప్రవర్తన పెంపుపై టీచర్లు దృష్టి పెట్టాలి.

### టీచర్లు గౌరవంగా జీవించాలి

అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు పెంచుతున్నాం. బడి పరిసరాలు పచ్చగా ఉండాలి.. అప్పుడే పిల్లలకు మంచి ఆలోచనలు వస్తాయి. బడిలో పచ్చదనం పెరిగేలా టీచర్లు చర్యలు తీసుకోవాలి. తెదేపా అధికారంలో ఉండగా 14 డీఎస్సీలు చేపట్టాం. టీచర్లు గౌరవంగా జీవించాలి.. రాజకీయ నేతల చుట్టూ తిరగకూడదు. ప్రతిభావంతులైన టీచర్లను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నాం. టెలికామ్, ఐటీ గురించి ముందే ఊహించా.. ఈ విషయం అప్పటి ప్రధానికి చెప్పా. ఆనాడు మేం వేసిన పునాది వల్లే హైదరాబాద్ రూపురేఖలు మారాయి. ఇప్పుడు ఏ దేశానికి వెళ్లినా మన తెలుగువాళ్లు కనిపిస్తారు. విదేశాల్లో ఎక్కువ సంపాదించేది కూడా తెలుగువాళ్లే. టెక్నాలజీని వాడుకుంటేనే అందరికంటే ముందుకెళ్లగలం. ఏఐ, క్వాంటం, డేటా సెంటర్లు, డ్రోన్లు, రోబోటిక్స్ వచ్చాయి" అని చంద్రబాబు అన్నారు.

## ఎవరినిపడితే వారిని భాజపాలోకి చేర్చుకోం: మురళీధర్‌రావు



హైదరాబాద్: మాజీ మంత్రి కొండా సురేఖ ను భాజపాలో చేర్చుకుంటారనే ప్రచారంపై ఆ పార్టీ సీనియర్ నేత మురళీధర్‌రావు స్పందించారు. ఎవరినిపడితే వాళ్లను పార్టీలో చేర్చుకోబోమని వ్యాఖ్యానించారు. "కాంగ్రెస్‌లో సంక్షోభం ప్రారంభమైంది. దాన్ని పక్కదారి పట్టించేందుకే ఇలాంటి కథనాలు వస్తున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం భాజపానే" అని మురళీధర్‌రావు అన్నారు.

## మోదీ తెలివైన వారు..

### ఆయన చెప్పినట్లు చేయాలి: బెల్జియం ప్రధాని

మొదటిపేజీ తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీపై బెల్జియం ప్రధాని బార్ట్ డె వెవర్  ప్రశంసలు కురిపించారు. అత్యంత స్ఫూర్తిదాయకమైన ప్రపంచ నేతల్లో ఆయన ఒకరని ప్రశంసించారు. మోదీ చాలా తెలివైన వారని.. అస్థిరమైన ప్రపంచ పరిస్థితుల మధ్య ఆయన అనుసరిస్తున్న విధానం ప్రత్యేకంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఏదైనా బాగా ఆలోచించే చెప్తారని.. ఆయన చెప్పినట్లు చేయాలన్నారు.

"గతంలో భారత పర్యటనకు రావాలనుకున్న సమయంలో కొవిడ్ ప్రబలడంతో పర్యటన రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ఎట్టకేలకు ఇక్కడికి చేరుకోవడం ఆనందంగా ఉంది. మోదీని కలవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. ఆయన్ను అత్యంత స్ఫూర్తిదాయకమైన ప్రపంచ నాయకుల్లో ఒకరిగా భావిస్తా. చాలా మంది ప్రపంచ నేతల మాటలు విన్నప్పుడు ఆందోళన, అభద్రతా భావం కలుగుతుంది. కానీ.. మోదీ మాట్లాడితే ఆయన చెప్పినట్లు చేయాలనిపిస్తుంది. చాలా స్ఫూర్తి పొందొచ్చు. ఆయన పాలనలో భారత్ అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోంది' అని బెల్జియం ప్రధాని పేర్కొన్నారు.

### ప్రపంచ వేదికపై పెరుగుతున్న భారత్ పాత్ర..

ప్రపంచ వేదికపై భారత్ పాత్ర కీలకంగా మారిందని బార్ట్ డె వెవర్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా.. వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను అభివర్ణించారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితి సమయంలో బ్రస్సెల్స్ ఇప్పుడు భారత్‌ను ఒక కీలక, విశ్వసనీయ భాగస్వామిగా చూస్తోందన్నారు. ఆ దేశంతో బంధాలను ఆర్థికంగా, రాజకీయంగానే కాకుండా వ్యూహాత్మకంగానూ మరో స్థాయికి తీసుకెళ్లాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

### ట్రంప్‌పై పరోక్ష విమర్శలు..

ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ (ఐశీఝశ్రీ‌ు ఎ‌తీబఎజూ) విధిస్తున్న సుంకాలపై బెల్జియం ప్రధాని పరోక్ష విమర్శలు చేశారు. 'ఈ రోజుల్లో అడ్డంకులు పెంచాలని, మార్కెట్లను మూసివేయాలని, సుంకాలు విధించాలని చాలా మంది పిలుపునిస్తున్నారు. కొందరు ఈ రోజు తీసుకున్న నిర్ణయాన్ని రేపు రద్దు చేస్తారు. ఎల్లుండి మళ్లీ పునరుద్ధరిస్తారు. నేను ఎవరి గురించి మాట్లాడుతున్నానో మీకు తెలిసే ఉంటుంది. అటువంటి వారి వల్ల ప్రపంచ వాణిజ్యమే ప్రమాదంలో పడే అవకాశం ఉంది. స్వేచ్ఛా మార్కెట్లు, బలమైన ఆర్థిక భాగస్వామ్యాల వల్లే అభివృద్ధి సాధ్యమవుతుంది' అని వ్యాఖ్యానించారు.

## జమ్మూకశ్మీర్‌లో లష్కరే కమాండర్ హతం

మొదటిపేజీ తరువాయి

పాకిస్థాన్ కేంద్రంగా పని చేస్తున్న నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తయ్యిబా కమాండర్‌ను జమ్మూకశ్మీర్‌లో భద్రతాబలగాలు మట్టుబెట్టాయి. కొంతకాలంగా ఉగ్రవాది యాసిర్ కదలికలపై నిఘా పెట్టిన భద్రతా బలగాలు శుక్రవారం యూస్‌మార్గ్ (శీబంఝతీస్త్ర)లో అతడిని గుర్తించాయి. ఇరువర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో యాసిర్ హతమైనట్లు అధికారులు వెల్లడించారు.

శుక్రవారం యూస్‌మార్గ్‌లోని పర్వత ప్రాంతాల్లో గాలింపు చేపట్టిన భద్రతా బలగాలపై ఓ ఉగ్రవాది కాల్పులు జరిపాడు. దీంతో కొనసాగిన ఎదురు కాల్పుల్లో అతడు మరణించాడు. హతమైన ఉగ్రవాదిని యాసిర్‌గా గుర్తించినట్లు శనివారం కశ్మీర్ పోలీసులు వెల్లడించారు. యాసిర్ గతంలో లష్కరే తయ్యిబాకు చెందిన ఓ ఉగ్రముఠాలో సభ్యుడిగా ఉండేవాడు. ఏడాది క్రితం ఆ బృందం నుంచి విడిపోయి, స్వతంత్రంగా ఉగ్ర కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు. పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడిన ముగ్గురు లష్కరే ఉగ్రవాదుల తో అతడికి సంబంధాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ సమయంలో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఉగ్రవాదుల ఫొటోలో యాసిర్ కూడా ఉండడం గమనార్హం. దీంతో కొంత కాలంగా అతడి కదలికలపై భద్రతా బలగాలు నిఘా ఉంచాయి.

మే 2024లో పూంఛ్‌లో భారత వైమానిక దళం కాన్వాయ్‌పై దాడి.. అదే ఏడాది అక్టోబరులో సోనామార్గ్ సమీపంలో కార్మికులపై దాడి, 2024 డిసెంబర్‌లో బోటా పత్రిలో సైన్యంపై దాడి వంటి ఘటనల్లో అతడి ప్రమేయం ఉంది. పూంఛ్ నుంచి యూస్‌మార్గ్ మీదుగా పుల్వామాలోని పఖేర్‌పోరా వైపు ఉగ్రవాదుల కదలికలు ఉన్నట్లు నిఘా వర్గాలు తెలపడంతో ఈ ఆపరేషన్ చేపట్టినట్లు సైనికాధికారులు వెల్లడించారు. ఉగ్రవాదుల కోసం వారం రోజులుగా మాటువేసినట్లు తెలిపారు. యాసిర్‌తో పాటు మరికొందరు ఉగ్రవాదులు కూడా ఉన్నారని, మిగతా వారికోసం గాలింపు కొనసాగుతోందన్నారు.

## ఝీరాం వ్యాలీలో మావోయిస్టుల దాడి కేసు..

మొదటిపేజీ తరువాయి

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో పదమూడేళ్ల క్రితం మావోయిస్టులు జరిపిన దాడిలో (ఝీశీఱర్ ఘ్ఝఎ 2013) కాంగ్రెస్ నేతలు సహా 29 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణ పూర్తి చేసిన ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు.. పది మందిని దోషులుగా తేలుస్తూ తీర్పు వెలువరిచింది. వీరిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. వీరందరికీ సెప్టెంబర్ 16న న్యాయస్థానం శిక్ష ఖరారు చేయనుంది. విచారణ సమయంలో దాదాపు 101 మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసినట్లు న్యాయస్థానం వెల్లడించింది.

బస్తర్ జిల్లాలోని ఝీరాం వ్యాలీలో 2013లో కాంగ్రెస్ పరివర్తన్ ర్యాలీ నిర్వహించింది. ఆ సభను లక్ష్యంగా చేసుకొన్న మావోయిస్టులు మెరుపు దాడి చేశారు. ఆ ఘటనలో కాంగ్రెస్ నేతలు, భద్రతా సిబ్బంది, సామాన్యులు సహా 29 మంది మృతి చెందారు. మరో 30 మంది గాయాలపాలయ్యారు. కాంగ్రెస్ రాష్ట్ర అగ్ర నాయకత్వం తీవ్రంగా నష్టపోయింది. నాటి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు నంద్‌కుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేశ్, అసెంబ్లీలో మాజీ విపక్ష నేత మహేంద్ర కర్మా, కేంద్ర మాజీ మంత్రి విద్యా చరణ్ శుక్లా, సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఉదయ్ ముదియార్ తదితరులు ప్రాణాలు కోల్పోయిన వారిలో ఉన్నారు. అయితే, ఈ తీర్పును ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేస్తామని డిఫెన్స్ లాయర్ పేర్కొన్నారు.

## నదిని శుభ్రం చేసిన బిట్టూ.. జాబ్ ఆఫర్ చేసిన నెదర్లాండ్స్ సీఈవో



మధ్యప్రదేశ్‌లో ఇటీవల అజ్నార్ నదిని శుభ్రం చేసిన ఓ 20ఏళ్ల యువకుడు 'బిట్టూ తబాహి' ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తోన్న విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో ఇటీవల వైరల్‌గా మారిన అతడికి నెదర్లాండ్స్‌కు చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ  ఉద్యోగం ఆఫర్ చేసింది. పర్యావరణ పరిరక్షణపై బిట్టూ చూపిన చొరవకు ముగ్ధుడైన డచ్ సంస్థ సీఈవో బోయన్ స్లాట్.. తమతో కలిసి పనిచేయాలంటూ ఆన్‌లైన్‌లో ఆహ్వానించడం విశేషం.

మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లా బియోరా పట్టణానికి చెందిన సురేంద్ర సింగ్ చౌధరీ (బిట్టూ తబాహి) డిగ్రీ చదువుతున్నాడు. స్థానికంగా ప్రవహించే అజ్నార్ నది ప్లాస్టిక్ వ్యర్థాలతో డంపింగ్ యార్డుగా మారడాన్ని చూసి ఎలాగైనా శుభ్రం చేయాలని నిశ్చయించుకున్నాడు. ఈత రాకున్నా.. గ్లౌజ్‌లు, బూట్లు లేకపోయినా.. వ్యర్థాలు తొలగించే పని (జశ్రీఝఱ-బజూ వీఱంంఱశీ) మొదలుపెట్టాడు. మధ్యలో కొందరు స్నేహితులు తోడుగా నిలవడంతో కొన్ని నెలల్లోనే పూర్తిచేశాడు. ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన బిట్టూ ప్రయాణం ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది.

# విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే దిక్సూచి: జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

- తల్లిదండ్రులు జన్మనిస్తే.. జీవితానికి దిశానిర్దేశం చేసేది గురువులే
- టీచర్స్ డే సందర్భంగా దూమల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ సందర్శించిన ఎస్పీ
- ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ ఘన సన్మానం.. విద్యార్థులకు విలువైన సూచనలు




ఎల్లారెడ్డిపేట మండలం దూమల / సెప్టెంబర్ 5 ప్రజాదివాస్

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఎల్లారెడ్డిపేట్ మండలంలోని దూమల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ను సందర్శించిన ఆయన విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, ఉన్నత విద్యపై వారి ప్రణాళికలను తెలుసుకున్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే, జీవితానికి జ్ఞానం, విలువలు, మార్గదర్శకత్వం అందించేది ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. "నేడు నేను జిల్లా ఎస్పీ స్థాయిలో ఉన్నానంటే నాకు విద్యాబుద్ధులు నేర్పి, సరైన మార్గం చూపిన నా గురువుల కృషి ఎంతో ఉంది" అని పేర్కొంటూ తన గురువులను స్మరించుకున్నారు. గురువులు విద్యార్థులకు దిక్సూచిలాంటి వారని, వారు చూపిన మార్గంలో క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించగలడని అన్నారు. ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ వారికి టీచర్స్ డే శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించిన ఎస్పీ, సోషల్ మీడియా వ్యసనం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేష్, ఎస్ఐలు, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో స్కూల్ బస్సును ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు: పలువురు విద్యార్థులకు గాయాలు



రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 05 ప్రజదివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కొత్త బస్టాండ్ సమీపంలో విద్యార్థులతో వెళ్తున్న స్కూల్ బస్సును ఒక ప్రైవేట్ బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. పంక్చువేట్ సంస్థకు చెందిన ప్రైవేట్ బస్సు తీవ్ర వేగంతో ఢీకొనడంతో స్కూల్ బస్సు కిటికీ అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రమాద తీవ్రతకు గాజు ముక్కలు లోపలికి దూసుకెళ్లడంతో బస్సులో ఉన్న పలువురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని, గాయపడిన విద్యార్థులను చికిత్స నిమిత్తం రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఊహించని ప్రమాదంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు పారదర్శకమైన , వేగవంతమైన సేవలందించాలి

- శాంతి భద్రతల పరిరక్షణలో కఠినంగా వ్యవహరించాలి: జిల్లా ఎస్పీ మహేష్ బి గితే.

ఎల్లారెడ్డిపేట మండలం / సెప్టెంబర్ 05 ప్రజదివాస్

వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం రోజున ఎల్లారెడ్డిపేట సర్కిల్ కార్యాలయం మరియు పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్పీ పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి వారు ప్రదర్శించిన ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్లు పరిశీలించి అభినందించారు. అనంతరం స్టేషన్ మరియు సర్కిల్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, పెట్రోలింగ్ నిర్వహణ, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించరు. ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలపై ఆరా తీసి సర్కిల్ పరిధిలోని అధికారుల, సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అభినందించారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో అప్రమత్తంగా ఉంటూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై వేగంగా స్పందించి పారదర్శకమైన సేవలు అందించాలని సూచించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ చెల్లింపుల భద్రత, మోసగాళ్లు అనుసరిస్తున్న కొత్త పద్ధతులపై ప్రజలను చైతన్యపరిచి, అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. డయల్--112 కు వచ్చే ప్రతి కాల్‌పై వెంటనే స్పందించి, సంఘటన స్థలానికి వేగంగా చేరుకుని బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాత నేరస్తులపై, రౌడి షీటర్స్ పై నిరంతర నిఘా కొనసాగించాలని, వారిని ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ నేరాల నివారణకు కృషి చేయాలని సూచించారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు పోలీసులపై మరింత నమ్మకం కలిగే విధంగా విధులు నిర్వహించాలని, విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని సూచించారు. రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, ప్రమాదకర డ్రైవింగ్, మైనర్ల వాహనాల వినియోగం పై చట్టపరమైన చర్యలు కొనసాగించాలని తెలిపారు. అనంతరం స్టేషన్ ఆవరణలో పోలీస్ అధికారులతో కలసి మొక్కలు నాటారు. ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ వెంకటేష్, ఎస్.ఐ లు రమేష్, శ్రీకాంత్, లక్ష్మణ్ , సిబ్బంది పాల్గొన్నారు.




# కాంగ్రెస్ ఆదరణ చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు

- అభివృద్ధి -సంక్షేమం ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- పార్లమెంట్ కో కన్వీనర్ చక్రధర్ రెడ్డి



ముస్తాబాద్/ సెప్టెంబర్ 5 ప్రజా దివాస్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకుంటున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ నాయకులు ముస్తాబాద్ మండల నాయకులు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కో కన్వీనర్ కణమేని చక్రధర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో 6 గ్యారంటీలు ప్రజలకు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి అన్నీ అమలు చేస్తున్నారని రైతులకు రుణమాఫీ, ఉచిత విద్యుత్,మహిళలకు సిలిండర్ పై సబ్సిడీ,ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లకు ఆర్థిక సాయం అందిస్తూ అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు, ప్రభుత్వ సంస్థల బలోపేతం చేయడం ఇవన్నీ ప్రజల్లో కాంగ్రెస్ కు వస్తున్న ఆదరణ చూసి బిఆర్ఎస్ నాయకులు ఓర్వలేక అసత్య ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదలకు అండగా ఉంటూ వారి అభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్జల రాజు ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రాజు రెడ్డి జిల్లా నాయకులు ఏళ్ల బాల్రెడ్డి, అరుట్ల మహేష్ ఆంజనేయులు రాకేష్ శ్రీనివాస్ నరేష్ మల్లేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ హామీలపై బీఆర్ఎస్ యువగర్జన

- వేములవాడలో భారీ ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు, యువత
- విద్యార్థులు, నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసింది: చల్మెడ లక్ష్మీనరసింహారావు
- 2 లక్షల ఉద్యోగాలు, రూ.4 వేల భృతి ఎక్కడ?: ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్
- హామీలు నెరవేర్చే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరిక

వేములవాడ / సెప్టెంబర్ 5 ప్రజాదివాస్

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆరోపించారు. శనివారం వేములవాడలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, విద్యార్థులు, యువతతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2 లక్షల ఉద్యోగాలు, రూ.4 వేల నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, రూ.5 లక్షల విద్యా భరోసా కార్డులు వంటి హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్రంలో పాఠశాలల మూసివేతలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ నేతృత్వంలో ఐటీ రంగం అభివృద్ధి చెంది వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయని గుర్తు చేశారు. రాజన్న ఆలయంలో స్థానికులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వకుండా ఇతర జిల్లాల వారికి అవకాశం కల్పించడం అన్యాయమని విమర్శించారు. అలాగే రూ.45 కోట్లతో మంజూరైన ఏటీసీ నిర్మాణ పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడాన్ని తప్పుబట్టారు. విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఏనుగు మనోహర్ రెడ్డి, ఏనుగు తిరుపతిరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమం

ముస్తాబాద్ / సెప్టెంబర్ 5 ప్రజా దివాస్




ముస్తాబాద్ మన దేశ మొట్ట మొదటి మాజీ ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముస్తాబాద్ లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయ దినోత్సవం యొక్క గొప్పతనాన్ని మరియు గురువుల యొక్క గొప్పతనాన్ని విద్యార్థులు తమ యొక్క ఉపన్యాసాల ద్వారా వివరించడం జరిగింది,అదేవిధంగా శాలువాతో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు చిరు సత్కారం చేయడం జరిగింది. తరుపది ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వడం జరిగింది.. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మ రాజిరెడ్డి మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది

# ప్రైవేట్ స్కూల్ బస్సు ద్విచక్ర వాహనదారుడు ఢీ..

- ద్విచక్ర వాహనదారుడికి స్వల్ప గాయాలు..

వేములవాడ / సెప్టెంబర్ 05 ప్రజదివాస్

వేములవాడ మున్సిపల్ పరిధి ఇస్లాం నగర్‌లో ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడికి స్వల్ప గాయాలయ్యాయి..స్థానికులు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదంపై వివరాలు సేకరించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.



# సరస్వతి దేవి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం మరియు- ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు..

ముస్తాబాద్ / సెప్టెంబర్ 5 ప్రజా దివాస్

ముస్తాబాద్ మండల పరిధిలోని పోతుగల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో జ్ఞాన స్వరూపిణి అయిన శ్రీ సరస్వతి దేవి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో జరిగింది వేద పండితుల మంత్రోచ్చారణలు,పూజా కార్యక్రమాల నడుమ పాఠశాల వాతావరణం ఆధ్యాత్మిక శోభతో వికసించింది. ఈ కార్యక్రమానికి పాఠశాల విద్యార్థినులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.దాతల ఉదారత అభినందనలుఈ విగ్రహాన్ని పాఠశాలకు బహూకరించిన విగ్రహ దాత ద్యావత్ పాండరిని ఈ సందర్భంగా గ్రామస్థులు, పాఠశాల సిబ్బందిని ఘనంగా సత్కరించి, అభినందించారు.అలాగే పాఠశాలలోని మౌలిక వసతులను పరిశీలించి, వాటి అభివృద్ధి కోసం తన్నీరు నర్సింగరావు దాదాపు రెండు లక్షల యాభై వేయిలకు రూపాయల పైగా భారీ ఆర్థిక సహాయాన్ని ప్రకటించి తమ ఉదారతను చాటుకున్నారు. దీనితో పాటు స్కూలుకు అవసరమైన సౌండ్ సిస్టమ్ (సౌండ్ బాక్స్)ను తన్నీరు హరిప్రియ విరాళంగా అందజేశారు.వీరితో పాటు పాక్స్ చైర్మన్ బాపూరావు మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్,మాజీ సర్పంచ్ తన్నీరు గౌతమ్ రావు కావటి మహిపాల్ కొడిముంజ రవి ఈ పాఠశాల విద్యాభివృద్ధికి దాతలుగా ముందుకు రావడం అభినంద నీయమని పలువురు కొనియాడారు.ముఖ్య అతిథుల సమక్షం:ఈ వేడుకలో గ్రామ సర్పంచ్ పెద్ది గారి యాదమ్మ శ్రీనివాస్,ఉప సర్పంచ్ కోల కృష్ణ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వరి జ్యోతి వెంకటేష్ , మాజీ ఎంపీపీ అక్కరాజ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే విద్యాశాఖ తరపున మండల విద్యాధికారి రవీందర్ సార్ కాంప్లెక్స్ హెచ్ఎం భూపతి మరియు ఈ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రేష్మ సుల్తానా మేడం పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.కార్యక్రమం అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణ గారి జయంతి సందర్భంగా ఉపాధ్యాయ బృందం తో కార్యక్రమం నిర్వహించడం జరిగినది.గ్రామ ప్రముఖుల



భాగస్వామ్యం కార్యక్రమంలో స్థానిక వార్డు మెంబర్ జంగారాజు తో పాటు గ్రామ ప్రముఖులు గీస శంకర్, పుట్ట శ్రీనివాస్, చెక్కపల్లి రాజు, గోదా శ్రీనివాస్, కావట్టి మహిపాల్ వంగ దేవయ్య, అక్కరాజు పరశు రాములు, చికోటి మహేష్, కాలేరు సుమన్, బండ అంజయ్య, గీసా శ్రీనివాస్, కొప్పు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినులు, మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ పునఃప్రతిష్ఠాపన మహోత్సవాన్ని విజయవంతం చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం విద్యార్థినులకు, భక్తులకు స్వీట్ మరియు తీర్థప్రసాద వితరణ జరిగింది.

# విద్యార్థులకు స్పోర్ట్స్ టి షర్ట్స్ అందజేత

- దాత చిట్నేని మాధవి వెంకటేశ్వరరావు

ముస్తాబాద్/ సెప్టెంబర్ 5 ప్రజా దివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో గల అంబేద్కర్ నగర్ ముస్తాబాద్ పాఠశాల నందు 45 మంది విద్యార్థిని ,విద్యార్థులకు , సుమారు 20 వేల రూపాయల ఖరీదు చేసే స్పోర్ట్స్ టి షర్ట్స్ లను ఉచితంగా అందజేసిన చిట్నేని వెంకటేశ్వర్ రావు గూడెం గ్రామ వాస్తవ్యులు ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు అట్టి పాఠశాల విద్యార్థు లందరికీ టీ షర్ట్స్ పంపిణీ చేశారు పలువురు మాట్లాడుతూ చదువులో చక్కగా రాణించాలని సూచించారు. ఆటలకు కూడా కొంచెం సమయం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి అంబటి రవీందర్ కాంప్లెక్స్ హెచ్ ఎం రాజిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ గౌడ్, అంజయ్య , గ్రామపంచాయతీ వార్డు సభ్యులు శీలం పద్మ, గోండయ్య, శ్రీనివాస్ గౌడ్, రజిని ,సంతోషి, విద్యార్థుల తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు

# నిజామాబాద్‌లో ఎరువుల కొరతపై రైతుల ఆగ్రహం..

- యాప్‌లలో కాదు.. షాపుల్లో కావాలి!.



సిరిసిల్ల-కొనరావుపేట ప్రధాన రహదారిపై బైఠాయింపు..

కొనరావుపేట మండలం / సెప్టెంబర్ 05 ప్రజదివాస్ సాగు ముంగిట అన్నదాతలకు కష్టాలు తప్పడం లేదు. సరిపడా యూరియా అందక, ఆన్లైన్ బుకింగ్ల పేరుతో ముప్పతిప్పలు పెడుతుండటంతో రైతన్న రోడ్డెక్కాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన రైతులు యూరియా కొరతను నిరసిస్తూ శనివారం సిరిసిల్ల-కొనరావుపేట ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. యాప్ బుకింగ్, సర్వర్ సమస్యలు, ఓటీపీల రగడతో గత కొద్ది రోజులుగా తాము పడుతున్న ఇబ్బందులను రైతులు కన్నీటి పర్యంతమవుతూ వివరించారు. ఉదయం నుంచే క్యూలైన్లలో నిలబడ్డా సర్వర్ పనిచేయక, రిజిస్ట్రేషన్ కాక ఎరువులు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేతికి వచ్చిన పంటకు యూరియా వేసే కీలక తరుణంలో అధికారుల చుట్టూ, సేవా కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోందని మండిపడ్డారు.నిరసన దీక్షలో భాగంగా రైతులు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. డిజిటల్ ప్రక్రియ పేరుతో క్షేత్రస్థాయిలో రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'యాప్‌లలో కాదు యూరియా.. షాపుల్లో కావాలి' నినాదాలు చేశారు. ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి, గతంలో మాదిరిగానే నేరుగా ఎరువుల దుకాణాల్లో ఎలాంటి ఆంక్షలు లేకుండా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనతో సిరిసిల్ల-కొనరావుపేట ప్రధాన రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి.

# జీవో 97ను రద్దు చేయాలి: అగ్రహారం పాలిటెక్నిక్ విద్యార్థులతో కేటీఆర్, చల్మెడ సమావేశం



వేములవాడ / సెప్టెంబర్ 05 ప్రజదివాస్

వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు, నియోజకవర్గ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిరిసిల్ల పాలిటెక్నిక్ విద్యార్థులు గత 20 రోజులకు పైగా ఆందోళన చేస్తున్నారని గుర్తుచేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను కార్మిక శాఖ (లేబర్ డిపార్ట్‌మెంట్) పరిధిలోకి తీసుకురావాలనే నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. కళాశాలల భూములు, ఆస్తులను ఇతర అవసరాల కోసం దారి మళ్లించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని, అలాంటి ప్రయత్నాలను కచ్చితంగా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఎల్లుండి నుండి ప్రారంభమయ్యే శాసనసభ సమావేశాల్లో జీవో 97 అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని నిలదీస్తారని కేటీఆర్ తెలిపారు. జీవో 97ను తక్షణమే రద్దు చేసి, యథావిధిగా ఎస్‌బీటీఈటీ (ఎస్బీటీఈటీ) పరిధిలోనే పాలిటెక్నిక్ విద్యను కొనసాగించే వరకు అసెంబ్లీ వేదికగాను, ప్రజాక్షేత్రంలోనూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# భూ భారతి అవకతవకలపై బీజేపీ మహా దీక్ష.. రాజన్న సిరిసిల్ల జిల్లా పార్టీ సంఘీభావం



రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 05 ప్రజదివాస్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి విధానంలో చోటుచేసుకుంటున్న అవకతవకలను నిరసిస్తూ, పేదలు, మధ్యతరగతి ప్రజలు, రైతుల భూములను సెక్షన్ 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద శనివారం "మహా దీక్ష" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి నేతృత్వంలో జిల్లా నాయకులు హాజరై పూర్తి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు, శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డిలకు వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి శేషవస్త్రం, కండువాలను కప్పి గోపి గౌరవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూ భారతి విధానంతో రైతులు, సామాన్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ ప్రజల పక్షాన నిలిచి పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ మహా దీక్షలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, కోశాధికారి ఆసాని రామలింగారెడ్డి, వివిధ మండల, పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్, బూరుగుపల్లి పరమేష్, మోకిలి విజయేందర్, సొల్ల క్రాంతి, కోడె రమేష్, లకుపతి నాయక్, మున్సిపల్ కౌన్సిలర్లు వంగల శ్రీనివాస్, రేగుల శ్రీకాంత్, సర్పంచ్ నక్క దాసరి రవి, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాగాయ్యపల్లిలో రెండు ఆటోలు ఢీ: ప్రయాణికులకు స్వల్ప గాయాలు

వేములవాడ / సెప్టెంబర్ 05 ప్రజదివాస్



వేములవాడ రూరల్ మండలం నాగాయ్యపల్లి గ్రామంలో శనివారం ఆటో ప్రమాదం చోటుచేసుకుంది. ఒక షాపు వద్ద ఆటో యూ-టర్న్ తీసుకుంటుండగా, ఎదురుగా వేగంగా వస్తున్న మరో ఆటో దానిని ఢీకొట్టింది. ఈ ప్రభావంతో ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పొదలు, చెట్లలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన జరిగే సమయంలో ఆటోలో సుమారు 10 మంది ప్రయాణికులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. వారికి స్వల్ప గాయాలు కాగా, పెను ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.


# జీవో 97ను రద్దు చేయాలి: అగ్రహారం పాలిటెక్నిక్ విద్యార్థులతో కేటీఆర్, చల్మెడ సమావేశం

వేములవాడ / సెప్టెంబర్ 05 ప్రజదివాస్

వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు, నియోజకవర్గ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిరిసిల్ల పాలిటెక్నిక్ విద్యార్థులు గత 20 రోజులకు పైగా ఆందోళన చేస్తున్నారని గుర్తుచేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను కార్మిక శాఖ (లేబర్ డిపార్ట్‌మెంట్) పరిధిలోకి తీసుకురావాలనే నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. కళాశాలల భూములు, ఆస్తులను ఇతర అవసరాల కోసం దారి మళ్లించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని, అలాంటి ప్రయత్నాలను కచ్చితంగా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఎల్లుండి నుండి ప్రారంభమయ్యే శాసనసభ సమావేశాల్లో జీవో 97 అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని నిలదీస్తారని కేటీఆర్ తెలిపారు. జీవో 97ను తక్షణమే రద్దు చేసి, యథావిధిగా ఎస్‌బీటీఈటీ (ఎస్బీటీఈటీ) పరిధిలోనే పాలిటెక్నిక్ విద్యను కొనసాగించే వరకు అసెంబ్లీ వేదికగాను, ప్రజాక్షేత్రంలోనూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.




# వేములవాడ మార్కెట్ యార్డ్‌లో రూ. 67 లక్షలతో నూతన షెడ్ల నిర్మాణం

**- పాలకవర్గ సమావేశంలో తీర్మానం**

వేములవాడ / సెప్టెంబర్ 05 ప్రజదివాస్



వేములవాడ వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో శనివారం మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం చైర్మన్ రొండి రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డ్‌కు వచ్చే రైతులు, వ్యాపారుల సౌకర్యార్థం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో రూ. 67 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా షెడ్లు (సెటర్లు) నిర్మించేందుకు పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సందర్భంగా పాలకవర్గ ప్రతినిధులు మాట్లాడుతూ... మార్కెట్ యార్డ్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వర్షం, ఎండల నుండి ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు పాడవకుండా ఉండేలా ఈ నూతన షెడ్ల నిర్మాణం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. త్వరలోనే పనులను ప్రారంభించి అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పాలకవర్గ సభ్యులు మరియు అధికారులు పాల్గొన్నారు.

# మగ్గంలో సాంకేతిక విప్లవం.. సిరిసిల్ల చేనేతకు కేటీఆర్ భరోసా!

**- నేతన్న పిలుపుతో విజయ్ ఇంటికి కేటీఆర్**

**- ఎలక్ట్రానిక్ జాకార్డ్‌తో ఆధునిక హ్యాండ్‌లూమ్ మగ్గం ఆవిష్కరణ**

**- 'వెండి వెన్నెల' చీరను ఆవిష్కరించిన కేటీఆర్**

**- విజయ్ ప్రయత్నాలకు ప్రశంసలు.. బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే కర్మాగారం హామీ**

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 05 ప్రజదివాస్

చేనేత రంగంలో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ వినూత్న ప్రయోగాలు చేస్తున్న నేతన్న నల్లా విజయ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. విజయ్ ఆహ్వానం మేరకు సిరిసిల్లలోని ఆయన నివాసానికి వచ్చిన కేటీఆర్.. ఎలక్ట్రానిక్ జాకార్డ్ టెక్నాలజీతో ఏర్పాటు చేసిన నూతన హ్యాండ్‌లూమ్ మగ్గాన్ని పరిశీలించి ఆవిష్కరించారు. అదే మగ్గంపై రూపొందించిన ప్రత్యేకమైన 'వెండి వెన్నెల' చీరను కూడా ఆవిష్కరించారు.

పరంధాములు వారసత్వాన్ని కొనసాగిస్తున్న విజయ్ సిరిసిల్ల చేనేతకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చిన నల్లా పరంధాములను కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. అగ్గిపెట్టెలో పట్టే చీరను నేసిన మహానుభావుడిగా పరంధాములు తన కళా నైపుణ్యాన్ని చాటారని అన్నారు. ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ కుమారుడు నల్లా విజయ్ ఆధునిక సాంకేతికతను చేనేత కళకు జోడిస్తూ అనేక వినూత్న ప్రయోగాలు చేస్తున్నారని ప్రశంసించారు. వెండి, బంగారంతో ప్రత్యేక చీరలు 'షిఫ్ట్ జాకార్డ్' వంటి ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని విజయ్ వెండి, బంగారంతో ప్రత్యేకమైన చీరలను రూపొందిస్తున్నారని కేటీఆర్ తెలిపారు. 'వెండి వెన్నెల' చీర అద్భుతంగా ఉందని, విజయ్ సృజనాత్మకత, నైపుణ్యాన్ని అభినందించేందుకే ఆయన ఆహ్వానం మేరకు వచ్చినట్లు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే కర్మాగారం విజయ్ చేస్తున్న ప్రయోగాలకు భవిష్యత్తులోనూ పూర్తి సహకారం అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిరిసిల్లలో విజయ్ కోసం అద్భుతమైన కర్మాగారం ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన సబ్సిడీలు అందిస్తామని తెలిపారు. ఈ పరిశ్రమను మరింత మంది నేతన్నలు అందిపుచ్చుకునేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. సిరిసిల్లను కేవలం పవర్‌లూమ్ పరిశ్రమకే పరిమితం చేయకుండా, ఆధునిక సాంకేతికతతో కూడిన హ్యాండ్‌లూమ్ చేనేతకు కూడా కేంద్రంగా తీర్చిదిద్దాలన్న విజయ్ ప్రయత్నాలు అభినందనీయమని కేటీఆర్ పేర్కొన్నారు. నేతన్నల శ్రమ



తగ్గుతుందిఎఎలక్ట్రానిక్ జాకార్డ్ టెక్నాలజీతో మగ్గం పని వేగం పెరగడంతో పాటు నేతన్నల శ్రమ తగ్గుతుందని నల్లా విజయ్ తెలిపారు. ముఖ్యంగా మహిళా కార్మికులకు పని సులభతరం అవుతుందని, తక్కువ శ్రమతో ఎక్కువ ఉత్పత్తి సాధ్యమవుతుందని చెప్పారు. ఆధునిక సాంకేతికతతో రూపొందిస్తున్న ప్రత్యేక చీరలకు వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని, తద్వారా నేతన్నలకు అదనపు ఆదాయం సమకూరుతోందన్నారు. చేనేత రంగాన్ని ప్రోత్సహించడంలో కేటీఆర్ ఎప్పుడూ ముందుంటారని విజయ్ అన్నారు. గతంలోనూ తాము రూపొందించిన వినూత్న చీరలను కేటీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించామని, తాజాగా కొత్త హ్యాండ్‌లూమ్ మగ్గం, దానిపై రూపొందించిన 'వెండి వెన్నెల' చీరను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

# విద్యార్థుల వైద్య విద్యకు మృతదేహం దానం

**జగిత్యాల మెడికల్ కాలేజీకి మృతదేహాన్ని అప్పగించిన రాచకొండ కళాధర్ కుటుంబ సభ్యులు**

జగిత్యాల జిల్లా / సెప్టెంబర్ 05 ప్రజాదివాస్



జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన రాచకొండ కళాధర్ అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి, కళాధర్ మృతదేహాన్ని శనివారం జగిత్యాల మెడికల్ కాలేజీకి వైద్య విద్యార్థుల అధ్యయనానికి ఉపయోగపడేలా అప్పగించారు. మెడికల్ కాలేజీ హెడ్ డా. శ్రీనివాస్ సమక్షంలో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని కాలేజీకి అందజేశారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు మృతదేహ అధ్యయనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, భవిష్యత్ వైద్యుల శిక్షణకు తమ కుటుంబ సభ్యుడి మృతదేహం దోహదపడాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కళాధర్ కుటుంబ సభ్యుల నిర్ణయాన్ని మెడికల్ కాలేజీ సిబ్బంది అభినందించారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లా। టీచర్స్ డే స్పెషల్

**- విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలి: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**- సామాజిక విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలి**

**- జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 37 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం**

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 5 ప్రజాదివాస్

విద్యార్థులను విద్యతో పాటు సామాజిక విలువలు, క్రమశిక్షణ, నైతికత కలిగిన బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా సమీకృత కార్యాలయాల



సముదాయం (ఐడీఓసీ)లో శనివారం నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం "జయ జయహే తెలంగాణ" గీతాన్ని వినిపించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 37 మంది ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలు, ప్రశంసాపత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, సమాజ అభివృద్ధికి వారు చేస్తున్న సేవలు అమూల్యమని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ఉపాధ్యాయుల సహకారం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా మాదిగ మహిళ సమైక్య నూతన కార్యవర్గ ఎన్నిక



ముస్తాబాద్/ సెప్టెంబర్ 5 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా మాదిగ మహిళ సమైక్య నూతన కార్యవర్గం ఎన్నిక పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మాదిగ మహిళ సమైక్య మరియు మహాజన మహిళ మండలి జాతీయ కమిటీ ఆధ్వర్యంలోఎం.ఎం.ఎం జాతీయ అధ్యక్షురాలు జేపీ లతా మాదిగ ఎంఎంఎస్ జాతీయ అధ్యక్షురాలు తబిత మాదిగ ఎంఎం ఎం జాతీయ అధికార ప్రతినిధి ఆలపాటి కరుణ రాష్ట్ర అధ్యక్షురాలు రజియా పోర్ కమిటీ చైర్మన్ చౌటపల్లి విజయ మాదిగ ఆధ్వర్యంలో మాదిగ మహిళాసమైక్య రాజన్న సిరిసిల్లా జిల్లా నూతన అధ్యక్షరాలుగా తాటి పెల్లి సునీత మాదిగ, ఉపాధ్యక్షురాలుగా,పంగ శిరీష మాదిగ,ప్రధాన కార్యదర్శిగా కుర్ర సావిత్రి, కార్యదర్శిగా గద్దల దేవవ్వ మాదిగ,సహాయ కార్యదర్శిగా తాటి పెల్లి బాలలక్ష్మి మాదిగలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వి హెచ్ పి ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షురాలు సడిమల శోభారాణి మాదిగ,మరియు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మాదిగ మహిళ సమైక్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రాజరాజేశ్వర సంస్కృత పాఠశాల, కళాశాలను సందర్శించిన డీఈవో, ఏఈవో

వేములవాడ / సెప్టెంబర్ 05 ప్రజదివాస్



వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ శ్రీ రాజరాజేశ్వర సంస్కృత పాఠశాల, కళాశాలను దేవస్థానం డీఈవో ప్రతాప నవీన్ కుమార్, ఏఈవో నాగుల మహేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు తరగతి గదులకు వెళ్లి ఉపాధ్యాయుల బోధనా తీరును గమనించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠాలు ఏ విధంగా అర్థమవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు, అధ్యాపకులు మరియు విద్యార్థుల హాజరు రిజిస్టర్లను, సంబంధిత రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు భోజనం అందించే ప్రదేశాన్ని పరిశుభ్రత దృష్ట్యా సందర్శించిన అధికారులు, విద్యార్థులకు స్వయంగా ఆహారాన్ని వడ్డించారు. భోజనం రుచి, నాణ్యత ఎలా ఉందని విద్యార్థులను అడిగారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. అనంతరం ఆట స్థలంతో (ప్లే గ్రౌండ్) పాటు పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించి, ఇంకా ఏమైనా అదనపు వసతులు అవసరమా అని ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. పాఠశాల, కళాశాలల్లో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా యూనిఫాం ధరించి, ఐడీ కార్డులు వేసుకోవాలని, నుదుటన బొట్టు పెట్టుకుని రావాలని సూచించారు. ఈ పరిశీలనలో పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, అధ్యాపక బృందం మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మారుపాక జెడ్పీహెచ్ఎస్, ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు యూనిఫారాల పంపిణీ



వేములవాడ / సెప్టెంబర్ 05 ప్రజదివాస్

వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)తో పాటు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం పాఠశాల దుస్తులను (యూనిఫారాలను) ఘనంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొబ్బల మల్లేశం, మాజీ సర్పంచ్ చెన్నమనేని స్వయంప్రభ పాల్గొని విద్యార్థులకు యూనిఫారాలను అందజేశారు. ప్రభుత్వం అందించే సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, పంచాయతీ కార్యదర్శి మరియు గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# దోమకొండ పోలీస్ స్టేషన్‌ను వార్షికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ..

-పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

-బాధితులకు సత్వర న్యాయం అందించాలి

ప్రజాదివాస్

వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ దోమకొండ పోలీస్ స్టేషన్‌ను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతి, సిబ్బంది పనితీరు, నేర నియంత్రణ చర్యలను సమీక్షించారు. ప్రతిరోజూ అధికారులకు అందిస్తున్న సూచనలు క్షేత్రస్థాయిలో సిబ్బందికి చేరుతున్నాయా లేదా అనే విషయాన్ని ఎస్పీ స్వయంగా సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యను పూర్తిగా విని సత్వర స్పందన అందించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన పోలీస్ సేవలు అందించడం ద్వారా పోలీస్ శాఖపై ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంపొందించాలని తెలిపారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి దోమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాల తీరు, పెండింగ్ కేసులు, గ్రేవ్ కేసులు, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, బైండోవర్ కేసులు, వారెంట్ల అమలు, బీట్ వ్యవస్థ తదితర అంశాలపై ఎస్పీ సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రేవ్ కేసుల్లో నాణ్యమైన దర్యాప్తుతో పాటు సాంకేతిక ఆధారాల సేకరణ, సాక్ష్యాల పరిరక్షణ, సాక్షుల వివరాల నమోదు వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు, బాధితుల సమస్యలను సున్నితంగా పరిష్కరించాలని తెలిపారు. మహిళలు, బాలలపై నేరాల విషయంలో చట్టా ప్రకారం నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌తో నేరాల నియంత్రణ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని ఎస్పీ ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలను, నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి పెట్రోలింగ్, బీట్ వ్యవస్థను మరింత పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. రాత్రి వేళల్లో గస్తీని సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు నేరాల నియంత్రణలో విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలన, ట్రాఫిక్ నిబంధనలు, మహిళలు, బాలల భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని సూచించారు. గణేష్ పండుగకు పటిష్ట భద్రత రాబోయే గణేష్ పండుగను పురస్కరించుకుని ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ఎస్పీ సూచించారు. ఎలాంటి



అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు గణేష్ పండుగను ప్రశాంత వాతావరణంలో సంతోషంగా నిర్వహించుకునేలా పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లోని అన్ని రికార్డులు, రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించి శాఖా నిబంధనల ప్రకారం పక్కాగా నిర్వహించాలని సూచించారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రజా భద్రత, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో సమన్వయంతో పనిచేసి ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించాలని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్, భిక్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరేశ్, దోమకొండ ఎస్‌ఐ ప్రభాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.
3

# శ్రీ భాషిత పాఠశాలలో ఘనంగా స్వయం పాలక దినోత్సవం

ప్రజాదివాస్

ఆర్మూర్ లోని శ్రీ భాషిత పాఠశాలలో భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి ని పురస్కరించుకొని స్వయం పాలక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే వివిధ బాధ్యతలను స్వీకరించి,



పాఠశాల నిర్వహణలో భాగస్వాములుగా వ్యవహరించారు. విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వివిధ విభాగాల బాధ్యతలు చేపట్టి తమ నాయకత్వ ప్రతిభను ప్రదర్శించారు. పాఠశాల కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, సమయపాలన, బాధ్యతాయుతమైన ప్రవర్తన, నిర్ణయాలు తీసుకునే విధానాన్ని ఆచరణాత్మకంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ మాట్లాడుతూ, "విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు, ప్రజాస్వామ్య విలువలు మరియు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయి అని తెలిపారు. డాక్టర్. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యారంగాని కి చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గురువుల సేవలు అమూల్యం: బావుసాయిపేట సర్పంచ్ యాస్మిన్ ఫిరోజ్ పాషా

- ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన సర్పంచ్ యాస్మిన్ ఫిరోజ్ పాషా

కోనరావుపేట మండలం / సెప్టెంబర్ 05 ప్రజదివాస్

కోనరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బావుసాయిపేట సర్పంచ్ యాస్మిన్



ఫిరోజ్ పాషా గురువులను ఘనంగా సన్మానించారు. విద్యాబుద్ధులు నేర్పి పిల్లల భవిష్యత్తుకు బాటలు వేసే ఉపాధ్యాయుల సేవలు అమూల్యమైనవని, సమాజ నిర్మాణంలో వారి పాత్ర కీలకమైనదని ఈ సందర్భంగా సర్పంచ్ కొనియాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఆర్మూర్ క్షత్రియ ఫంక్షన్ హాల్ నందు గణేష్ ఉత్సవ నిర్వాణ సమన్వయ సమావేశం హాజరైన పోలీస్ కమిషనర్

- నిజామాబాద్ సిపి కమిషనరేట్ పి. సాయి చైతన్య ఐపీఎస్

- ఆర్మూర్ క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు గటడి ఆనంద్ (న్యాయవాది)

ప్రజాదివాస్

ఆర్మూర్ లో గణేష్ ఉత్సవ నిర్వహణ సమన్వయ సమావేశం హాజరైన నిజామాబాద్ జిల్లా పోలీస్ కమీషనరేట్ ఐపీఎస్ పి. సాయి చైతన్య పరిధిలోని ఆర్మూర్ డివిజన్ మున్సిపల్ పట్టణ కేంద్ర క్షత్రియ కళ్యాణ మండపం లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం రోజున గణేష్ ఉత్సవాల నిర్వహణపై ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలను, నిమజ్జన కార్యక్రమాలను శాంతిభద్రతల పరిరక్షణతో, అత్యంత వైభవంగా మరియు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడమే లక్ష్యంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో ముఖ్య అతిథి పి. సాయి చైతన్య ఐపీఎస్ మాట్లాడుతూ క్రింది ముఖ్య సూచనలు చేశారు. ముందస్తు అనుమతులు గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ మరియు సంబంధిత శాఖల నుండి ముందస్తుగా అధికారిక అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. శాంతిభద్రతల పరిరక్షణ ఉత్సవాల సమయం లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా ఉంచాలని, ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి పండుగను జరుపుకోవాలని సూచించారు. భద్రతా చర్యలు: మండపాల వద్ద రాత్రి సమయాలలో నిర్వాహకులు స్వచ్ఛందంగా బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని, సిసి కెమెరాల నిఘా ఉంచడం మంచిదని పేర్కొన్నారు. శాఖల సమన్వయం: విద్యుత్, మున్సిపల్, రెవెన్యూ మరియు పోలీస్ శాఖలు సంయుక్తంగా సమన్వయం చేసుకుంటూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వదంతుల నివారణ: సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను, వదంతులను నమ్మవద్దని, ఏదైనా అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే పోలీస్ శాఖకు తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్మూర్ డివిజన్ పోలీస్ అధికారులు, వివిధ శాఖల ప్రభుత్వ ప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. – జిల్లా పోలీస్ సమాచార విభాగం, నిజామాబాద్. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన మాలవ్య,



ఐ.ఏ.ఎస్, ఆర్మూర్ ఏ.సి.పి వెంకటేశ్వర రెడ్డి , ఏ.సీ.పి ట్రాఫిక్ శ్రీ మస్తాన్ అలీ , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి , ఆర్మూర్ ఎస్హెచ్ఓ శ్రీ సత్యనారాయణ గౌడ్, ఆర్మూర్ రూరల్ సీ.ఐ శ్రీ జాన్ రెడ్డి, ఆర్మూర్ క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు గటడి ఆనంద్ (న్యాయవాది), మున్సిపల్ చైర్ పర్సన్ గోని లహరి, మున్సిపల్ వైస్ చైర్మన్ కాటేపల్లి వెంకట్ రెడ్డి, ఆర్మూర్ ఎస్సై రజనీకాంత్ ,బాల్కొండ ఎస్సై శైలందర్, మెండోరా ఎస్సై సుహాసిని, మున్సిపల్ కౌన్సిలర్లు , సర్పంచులు మరియు సార్వజని గణేష్ మండలి సభ్యులు , గణేష్ మండలి నిర్వాహకులు , ఆర్గనైజర్లు వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# నాలుగు నెలల్లో బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కోనరావుపేట మండలం / సెప్టెంబర్ 05 ప్రజదివాస్

కోనరావుపేట మండలం కొలనూరు – రామన్నపేట గ్రామాల మధ్య మంజూరైన హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేసి, రాబోయే నాలుగు నెలల్లోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివారం ఆయన బ్రిడ్జి నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిధులు మంజూరైనప్పటికీ పనుల్లో జాప్యం జరగడంపై ఎమ్మెల్యే అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు ఆలస్యమయ్యాయని, మళ్లీ పనులు ప్రారంభించినందున ఇకపై ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పనులను ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. వర్షాకాలంలో ప్రజలకు రవాణా ఇబ్బందులు కలగకుండా పనుల పురోగతిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

# హలో విశ్వకర్మ.. చలో కామారెడ్డి..

-విశ్వకర్మ ఆత్మీయ సమ్మేళనానికి భారీగా తరలిరావాలి

ప్రజాదివాస్




అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లాలో ఆదివారం విశ్వకర్మ బంధువుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షులు తిప్పర్తి సతీష్ విశ్వకర్మ తెలిపారు. దేవనపల్లి మండలంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నిర్వహించనున్న ఈ ఆత్మీయ సమ్మేళనం జిల్లా అధ్యక్షులు తిప్పర్తి సతీష్ విశ్వకర్మ అధ్యక్షతన జరగనుంది. ఈ సందర్భంగా విశ్వకర్మలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సభలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రస్థాయి నాయకులు హాజరుకానున్నారు. రాష్ట్ర అధ్యక్షులు కౌలె జగన్నాథం, మహిళా కమిషన్ సభ్యులు కాసోజి శంకరమ్మ ముఖ్య అతిథులుగా పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విశ్వకర్మ బంధువులు, కుల పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు తిప్పర్తి సతీష్ విశ్వకర్మ పిలుపునిచ్చారు.

# రెడ్డిలు ఐక్యతతో హక్కుల సాధనకు కృషి చేయాలి..

ప్రజాదివాస్

కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం రెడ్డి సంఘాల సభ్యులు ఐకమత్యంతో ముందుకు సాగి తమ హక్కుల సాధనకు సమష్టిగా కృషి చేయాలని తాడ్వాయి మండల రెడ్డి కమిటీ అధ్యక్షుడు పొద్దుటూరి నవీన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం తాడ్వాయి మండల కేంద్రంలో నిర్వహించిన రెడ్డి సంఘాల నెలవారీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న నిరసన దీక్షకు మండలంలోని అన్ని గ్రామాల రెడ్డి సంఘాల సభ్యులు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. నిరసన దీక్షకు హాజరయ్యే సభ్యులు తమ పేర్లను ఆయా గ్రామాల రెడ్డి సంఘాల అధ్యక్షులకు అందజేయాలని సూచించారు. గ్రామ అధ్యక్షులు తమ గ్రామం నుంచి దీక్షకు వచ్చే సభ్యుల పూర్తి జాబితాను మండల కమిటీకి అందజేసి అవసరమైన సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల్లో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. పల్లె స్థాయిలో రెడ్డి సంఘాల ఐక్యతను మరింత బలోపేతం చేసుకుని, సంఘం హక్కుల సాధన కోసం సమష్టిగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పొద్దుటూరి నవీన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఏనుగు రమేష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బొక్క ప్రతాప్‌రెడ్డి, జిల్లా సలహాదారు ఏనుగు మోహన్‌రెడ్డి, కార్యదర్శి పులగం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జంగం నరేందర్‌రెడ్డి, డైరెక్టర్లు, మండల సలహాదారు నిమ్మల రాజు, ఎంద్రాయిల్ రామిరెడ్డి, మండల కమిటీ సలహాదారులు తదితరులు పాల్గొన్నారు.



# బోర్ మోటార్ కేబుల్ వైర్ల దొంగల ముఠా అరెస్ట్..

ప్రజాదివాస్

వ్యవసాయ పొలాల్లో బోర్ మోటార్ల కేబుల్ వైర్లను దొంగిలిస్తున్న ముఠాను భిక్నూర్ పోలీసులు ఛేదించారు. సీసీ కెమెరా ఫుటేజీ, సాంకేతిక పరిజ్ఞానం, ఇతర ఆధారాల ఆధారంగా దర్యాప్తు చేపట్టి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. అంతంపల్లి గ్రామానికి చెందిన జీడి భీమయ్య తన వ్యవసాయ పొలంలోని గదిలో బోర్ మోటార్ స్టార్టర్ బాక్స్‌ను ఉంచి ప్రతిరోజూ పరిశీలించేవాడు. ఈ నెల 3న సాయంత్రం పొలానికి వెళ్లి గదికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం పొలానికి వెళ్లి చూడగా గది తాళం పగులగొట్టి ఉండటంతో పాటు స్టార్టర్ బాక్స్, బోర్ మోటార్‌కు సంబంధించిన కేబుల్ వైర్లను కట్ చేసి దొంగిలించినట్లు గుర్తించాడు. పరిసర పొలాల్లో కూడా కేబుల్ వైర్లు చోరీకి గురైనట్లు గుర్తించి భిక్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ఆదేశాల మేరకు, కామారెడ్డి డీఎస్పీ పర్యవేక్షణలో భిక్నూర్ సీఐ నరేష్, ఎస్‌హెచ్‌ఓ ఎస్. అనిల్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి. సీసీ కెమెరా ఫుటేజీ, సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించారు. విచారణలో నిందితులు రాత్రి వేళల్లో వ్యవసాయ పొలాల్లోని బోర్ మోటార్ కేబుల్ వైర్లను కట్ చేసి దొంగిలించి, వాటిని పెట్రోల్‌తో కాల్చి రాగి తీగలను వేరు చేసి స్క్రాప్ షాపుల్లో విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. ఉగ్రవాయి, బస్వాపూర్ శివారు, అంతంపల్లి గ్రామ శివారుల్లో చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల పాత్ర బోరెడ్డి నరేందర్ రెడ్డి: బంటు రామ్ చరణ్‌తో కలిసి బోర్ మోటార్ కేబుల్ వైర్లను కట్ చేసి దొంగిలించాడు. మోహన్ ఏ బైరాం మోహన్ ఏ రాజు: దొంగిలించిన కేబుల్ వైర్లను కాల్చి రాగి తీగలను వేరు చేశాడు. బిచగాని ఏ అండాసి శ్రీకాంత్: ఇనుప రాడ్‌తో పొలంలోని గది తాళాన్ని పగులగొట్టాడు. బంటు రామ్ చరణ్: కట్టర్‌తో స్టార్టర్, బోర్ మోటార్ కేబుల్ వైర్లను కట్ చేశాడు. నిందితులు దొంగిలించిన కేబుల్ వైర్ల నుంచి వేరు చేసిన రాగి తీగలను స్క్రాప్ షాపులో విక్రయించి వచ్చిన డబ్బును పంచుకున్నారు. అనంతరం భిక్నూర్ ప్రాంతంలో మరిన్ని చోరీలకు వెళ్తుండగా భిక్నూర్ బస్టాండ్ వద్ద పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రాగి తీగలు, కేబుల్ వైర్లు కట్ చేసేందుకు ఉపయోగించిన కట్టర్లు, తాళం పగులగొట్టేందుకు ఉపయోగించిన ఇనుప రాడ్,



మొబైల్ ఫోన్, కేబుల్ వైర్లను కాల్చేందుకు ఉపయోగించిన వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించింది. వ్యవసాయ పొలాల్లోని బోర్ మోటార్లు, కేబుల్ వైర్లకు రైతులు భద్రతా చర్యలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని భిక్నూర్ పోలీసులు సూచించారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ కామారెడ్డి, భిక్నూర్ సీఐ నరేష్, ఎస్ఐ అనిల్‌తో పాటు పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# 22-ఏ నిషేధిత జాబితా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా బీజేపీ నిరసన..

ప్రజాదివాస్

22-ఏ నిషేధిత జాబితా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి వ్యతిరేకంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డితో పాటు కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 22-ఏ నిషేధిత జాబితా అంశంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై బీజేపీ నేతలు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలగకుండా సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో బీజేపీ శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, వివిధ జిల్లాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.



# కాంగ్రెస్ తీరుపై ధర్మపురిలో బీఆర్ఎస్ భారీ ర్యాలీ

**- కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క హామీల డిక్లరేషన్ అమలు కాలేదు**

**- అదొక మోసాల డిక్లరేషన్ : మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**

ప్రజాదివాస్

కాంగ్రెస్ ఇచ్చిన యూత్ డిక్లరేషన్ ఒక్క హామీల డిక్లరేషన్ కాదని అదొక మోసాల డిక్లరేషన్ అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్రస్థాయిలో విమర్శించారు శనివారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో అంబేద్కర్ విగ్రహం నుండి గాంధీ చౌక్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు అనంతరం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన యూత్ డిక్లరేషన్ ఒక హామీల డిక్లరేషన్ కాదని అది ఒక మోసాల డిక్లరేషన్ అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్రస్థాయిలో విమర్శించారు అలాగే ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు: ప్రభుత్వం రూ. 14,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పెట్టడం వల్ల కళాశాల యాజమాన్యాలు సర్టిఫికేట్లు ఇవ్వకుండా విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నాయని ఆరోపించారు. పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల ఉచిత విద్యకై కేటాయించిన 'బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు' రూ. 300 కోట్ల బకాయిలు ఉంచడం వల్ల పిల్లలను పాఠశాలల నుండి బయటకు




పంపుతున్నారని మండిపడ్డారు. 250 నర్సింగ్ స్కూళ్లలోని మేనేజ్‌మెంట్ కోటా విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను రద్దు చేసేందుకు కమిషనర్‌తో లేఖ రాయించారని విమర్శించారు. గురుకుల వ్యవస్థను నిర్వీర్యం చేసి 'యంగ్ ఇండియా మోడల్ స్కూళ్ల' పేరుతో కాలయాపన చేస్తున్నారని, రాష్ట్రంలో 2,000 పాఠశాలలు మూతపడి 1,25,000 అడ్మిషన్లు తగ్గాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని నెరవేర్చకపోగా, కేసీఆర్ హయాంలో ఇచ్చిన 50,000 ఉద్యోగాలను తమ ఖాతాలో వేసుకుని 70,000 ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు వాగ్దానం చేసిన విద్యా ప్రోత్సాహకాలు టెన్త్ పాస్ అయితే 5,000, ఇంటర్ పాస్ అయితే 20,000, డిగ్రీ పాస్ అయితే 1 లక్ష, పీజీ పాస్ అయితే 2 లక్షలు, పీహెచ్‌డీ పాస్ అయితే 5 లక్షలు మరియు 18 ఏళ్లు నిండిన విద్యార్థినులకు 'స్కూటీల' పంపిణీ హామీలు ఏమయ్యాయని నిలదీశారు. సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ కొనుగోళ్లలో (షూస్, బెల్టులు, బ్యాగులు మొదలైనవి) స్థానిక ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్లను పక్కనపెట్టి గుజరాత్ కాంట్రాక్టర్లకు కట్టబెట్టి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని సరిగ్గా నిర్వహించకుండా, ఎక్స్‌ప్రెస్ బోర్డులు పెట్టి బస్సులు ఆపకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో 7.50 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇచ్చి ఉచిత బియ్యం అందిస్తే, ప్రస్తుతం స్మార్ట్ కార్డుల పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో రోజుకు 6 నుండి 8 గంటల పాటు (రాత్రి వేళల్లో) విద్యుత్ కోతలు విధించడాన్ని ప్రశ్నించారు. గతంలో కేటీఆర్ ధర్మపురి అభివృద్ధికి మంజూరు చేసిన 25 కోట్ల నిధులను రద్దు చేశారని, 6,000 ఎకరాలకు నీరందించే అక్కపెల్లి ప్రాజెక్ట్ పనులతో పాటు కమలాపూర్, గంగ మరియు గోదావరి రోడ్ల నిర్మాణాన్ని నిలిపివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడు గోదావరి ప్రక్షాళనకు మంజూరు చేసిన 25 కోట్లను కాంగ్రెస్ నాయకులు కోర్టు కేసులు వేసి అడ్డుకున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే రూ. 14,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలి. 'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్'కు రావాల్సిన 300 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలి.

# అశ్వరావుపేట లో పామాయిల్ రైతులకు మొక్కలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొనున్న మంత్రి తుమ్మల...

ప్రజాదివాస్

**పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ స్థలాన్ని పరిశీలించనున్న మంత్రి తుమ్మల...**

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు రేపు అనగా ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు అశ్వరావుపేటలో పర్యటించనున్నారు. ఈ పర్యటన లో భాగంగా పామాయిల్ డివిజన్ కార్యాలయంలో స్థానిక శాసనసభ్యుడు జారే ఆదినారాయణ తో కలిసి పామాయిల్ మొక్కల పంపిణీని ప్రారంభించి, అక్కడ ఏర్పాటుచేసిన పామాయిల్ రైతుల సమావేశంలో మంత్రి తుమ్మల పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం ఆయిల్ ఫెడ్ అధికారులతో కలిసి పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణపు స్థలాన్ని మంత్రి తుమ్మల పరిశీలిస్తారు.




# క్రిషి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలోని బాలికలకు సైకిల్లు పంపిణీ

ప్రజాదివాస్

ఆత్మకూరు మండలం నీరుకుల్లా జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో టీచర్స్ డే సందర్భంగా, క్రిషి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హైస్కూల్ మరియు ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, మరియుఉపాధ్యాయులకి సన్మాన కార్యక్రమం చేశారు. తదుపరి కార్యక్రమం క్రిషి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నేడు పాఠశాలలోని బాలికలకు 7 సైకిల్లు పంపిణీ చేశారు. హై స్కూల్ బాలికలకు సైకిల్ అందజేయడానికి మన్విత ఎన్ఆర్ఐ సహకారం అందించారు, అలాగే ఇదే పాఠశాలలో చదువుకున్న ఎన్ఆర్ఐ లు బొంపెల్లి సతీష్ మరియు పొనుగోటి మురారి సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు గతంలో విద్యార్థులకు నోట్ బుక్స్ మరియు స్టడీ మెటీరియల్స్ మరియు పెన్సిల్ పెన్నులు అలాగే ప్రాథమిక ఉన్నత పాఠశాలలో కూడా స్కూల్ పిల్లలకు పెన్నులు మరియు పెన్సిల్స్ అందించారు. క్రిషి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పొనుగోటి సత్యనారాయణ



మాట్లాడుతూ, ఇలాగే పలు స్కూళ్లలో సేవా కార్యక్రమాలు విద్యార్థులకు నోట్ బుక్స్ మరియు కంటి అద్దాలు ఒ లైబ్రరీ మెటీరియల్ అందించడం జరిగిందన్నారు. అలాగే నీరుకుల్ల పాఠశాల క్రీడాకారులకు నేను కూడా నా వంతుగా స్కూల్ పిల్లలకి సాయం చేస్తానంటూ ముందుకు వచ్చి స్కూలు పిల్లలకు, నీలం రాజు వాలీబాల్ స్పోర్ట్స్ టీ షర్ట్స్ అందించారు. ఇలాంటి కార్యక్రమాలు ఇక మునుముందు ఇంకా చేయాలని ఆమె కోరారు అలాగే నీరుకుల్లా గ్రామ సర్పంచ్ తడుక నీరజ శ్రీనివాస్ మాట్లాడుతూ నీరు కుల్ల హైస్కూలో చదువుకొని ఎంతో ఎత్తుకు ఎదిగి ఒక స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి పేద పిల్లలకి ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో, గ్రామ ఉప సర్పంచ్ కిన్నెర ప్రేమ్చంద్, మరియు అమ్మ ఆదర్శ పాఠశాల అక్కల రుద్రమ, మాజీ సర్పంచ్ హర్షం బలరాం, గ్రామం పెద్దలు పిట్టల రాజమౌళి, మ్యాస్ టీచర్ రమేష్, అమ్మ కోమల, మరియు గ్రామ నాయకులు, హర్షం కుమార్ స్వామి, పొనుగోటి శ్రీనివాస్, వార్డ్ నెంబర్, నాగరాజు, ఉడత రాజేందర్, తదితరులు పాల్గొన్నారు

# సేవ్ తెలంగాణ ఆయిల్ఫెడ్ నినాదంతో కదం తొక్కిన పామాయిల్ రైతులు

**- సంస్థ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే యత్నాలను అడ్డుకోవాలని డిమాండ్**

**- అజామాబాద్‌లోని 15,984 చదరపు గజాల భూమిపై ఆయిల్ఫెడ్‌కే పూర్తి హక్కులు కల్పించాలి**

ప్రజాదివాస్

అశ్వారావుపేట తెలంగాణ ఆయిల్ఫెడ్ సంస్థ పరిరక్షణే ధ్యేయంగా ఆయిల్ పామ్ సాగు రైతులు కదం తొక్కారు. సేవ్ తెలంగాణ ఆయిల్ఫెడ్ అనే నినాదంతో సంస్థ విలువైన ఆస్తులను కాపాడాలని డిమాండ్ చేస్తూ భారీ ధర్నా నిర్వహించారు. తెలంగాణ ఆయిల్ ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్ ఫామ్ గ్రోవర్స్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో వందలాది మంది రైతులు పాల్గొని నిరసన గళం విప్పారు. ?సంస్థకు చెందిన కోట్లాది రూపాయల విలువైన ఆస్తులను కొందరు ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు కబళించేందుకు కుట్ర పన్నుతున్నాయని, అధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకుని సంస్థ ప్రయోజనాలను కాపాడాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు వ్యవసాయ శాఖ, ఆయిల్ఫెడ్ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు.?అజామాబాద్ భూమి వివాదం – – రైతుల అభ్యంతరం

హైదరాబాద్‌లోని అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, ప్లాట్ నెం.1లోని 15,984.50 చదరపు గజాల భూమిని 1991లో ప్రభుత్వం (జీవో ఎంఎస్ నెంబర్ .93 ద్వారా) ఆయిల్ఫెడ్‌కు కేటాయించిందని, అప్పటి నుంచి ఈ భూమి నిరంతరాయంగా సంస్థ ఆధీనంలోనే ఉందని సంఘం నాయకులు గుర్తుచేశారు. గతంలో లీజు నిబంధనలు ఉల్లంఘించిన లహోటి ఆయిల్ మిల్స్‌కు ఆ భూమిపై నామమాత్రపు హక్కులే ఉన్నాయని గతంలో సుప్రీంకోర్టు స్పష్టం చేసినప్పటికీ, 2003లో అప్పటి ప్రభుత్వం వివాదాస్పదంగా జీవో ఎంఎస్ నెంబర్.366 జారీ చేసి లీజు పునరుద్ధరణ ఉత్తర్వులు ఇవ్వడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ?హైకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం 2015 లోనే సదరు జీవో ఉపసంహరణపై షోకాజ్ నోటీసు జారీ చేసిందని, అయినప్పటికీ ఇప్పటివరకు తుది నిర్ణయం తీసుకోకపోవడం సంస్థ ఉనికికే



ముప్పుగా మారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.??అత్యధిక ప్రాసెసింగ్ ప్లాంట్లతో వేలాది మంది రైతులకు జీవనోపాధి కల్పిస్తూ, విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేస్తున్న తెలంగాణ ఆయిల్ఫెడ్ సంస్థ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తుల పరం చేయకుండా కాపాడాలని, ?రైతుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఆయిల్ఫెడ్ ఆస్తులను కాపాడేంతవరకు తమ పోరాటం ఆగదని సొసైటీ అధ్యక్షులు తుంబురు ఉమామహేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొక్కెరపాటి పుల్లయ్య తదితరులు హెచ్చరించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆయిల్ఫెడ్ యాజమాన్య హక్కులను అధికారికంగా ఖరారు చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.

# తాడ్వాయిలో BRS పార్టీ ఆధ్వర్యంలో వంటవార్పు



ఈ కార్యక్రమంలో పాల్గొన్న ములుగు నియోజకవర్గ దీ=ా పార్టీ ఇంచార్జ్ బడే నాగజ్యోతి ములుగు జిల్లా అధ్యక్షులు లికాకులమర్రి లక్ష్మణ్ బాబులిమరియు – ఈ కార్యక్రమానికి దీ=ా పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి, ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు,హాజరై పాల్గొన్నారు.

– కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ నిరసనలో భాగంగా వంటవార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు.– రైతులు, విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని దీ=ా నాయకులు డిమాండ్ చేశారు.– ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు దీ=ా పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని నాయకులు తెలిపారు.– ప్రజా సమస్యల పరిష్కారం కోసం దీ=ా పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని వారు పేర్కొన్నారు.– ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవిందా నాయక్ లివర్ల వెంకన్న ముదిరాజ్ మహా సభ ములుగు జిల్లా అధ్యక్షులు ములుగు జిల్లా సీనియర్ నాయకులు, ఉద్యమ కారుడు, తుమ్మ మల్లారెడ్డి,పత్తి గోపాల్ రెడ్డి జిల్లా నాయకులు కాకులమర్రి ప్రదీప్ రావు,మాజీ ఆత్మ కమిటీ చేర్మెన్ దుర్గం రమణయ్య జగదీష్, తాటి కృష్ణ, కర్ర రవీందర్,ఎస ఖాజాపాషా,తాడ్వాయి మండల అధ్యక్షులు దండుగులా మల్లయ్య మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు తుమ్మల రాజేందర్ ముదిరాజ్ తాడ్వాయి సర్పంచ్ ప్రవళిక గున్ను మరియు ఎతీం సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది7జీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి , వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్, బిఆర్ఎస్ నాయకులు భీమ శ్రీధర్, బీ ఆర్ ఎస్ వి జిల్లా కోఆర్డినేటర్ సంకుబాపన అనుదీప్, నియోజవర్గ అధ్యక్షులు మధుచంద్, నాయకులు, మల్లెల రవిచంద్ర, జూపల్లి దుర్గాప్రసాద్, కంచర్ల రామారావు, వివిధ మండల పార్టీ అధ్యక్షులు మంతపురి రాజు గౌడ్, కొట్టి వెంకటేశ్వరరావు, పూసల విశ్వనాథం, ముత్యాల రాజేష్, కార్పొరేటర్ మల్హోత్రా సాగర్, గుణ చరిత, రాంబాబు, మాజీ కౌన్సిలర్లు రుక్మంగదర్ బండారి, అంబుల వేణు, డివిజన్ పార్టీ ఇన్చార్జిలు ముద్దంగుల మహేష్, వేమునూరి శివకృష్ణ, జూనూరు రాజేష్, మాదాసు పద్మ, డికొండ సునీత, మాజీ ఎంపీపీలు బాదావత్ శాంతి, భూక్యా సోనా, సర్పంచులు బాదావత్ శ్రీకాంత్, బలరాం, తోగర రాజశేఖర్, బొమ్మిడి రమాకాంత్, బొమ్మిడి శ్రీకాంత్, కన్ని, నవతన్, కరాటే శీను, వీరన్న, సేవియా, ఆనంద్, మేకల నాగబాబు, సంపూ సత్యనారాయణ, జగన్, వెంకటేష్, గురువయ్య, మంజుల, నరకట్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అందోల్ గ్రామ పంచాయితీ కి చెందిన అసైన్డ్ భూముల 80కుటుంబాలకు పట్టాపాసు పుస్తకాలు జారిచేసి ప్రభుత్వం న్యాయం చేయాలి.

**- జోగిపేట తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా**

**- మైసగాళ్ల బుచ్చేంద్ర మాదిగ వీ=ాా మాజీ జిల్లా అధ్యక్షులు**

ప్రజాదివాస్

ఆందోల్ నియోజవర్గంలోని జోగిపేట మున్సిపాలిటీలో శనివారం రోజున పుర్ర సంతోష్ మాదిగ అందోల్ నియోజకవర్గ ఇంచార్జి అధ్వర్యంలో అందోల్ తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఎమ్మార్వో గారికి రైతుల పక్షాన వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా మైసగాల్ల బుచేంద్ర మాదిగ ఎం ఆర్ పి ఎస్ మాట్లాడుతూ సర్వే నెంబర్: 1141లో ఆనాడు అంటే 2005సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో దేశ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ గారి చేతుల మీదుగా ఆనాడు 80కుటుంబాలకు పట్టాల సర్టిఫికెట్ ఇవ్వడం జరిగింది. ఆనాడుగా ఆరుతడి పంటలు



సాగుచేసుకొని, రైతులు జీవనం సాగిస్తున్నారు.ఇప్పటికి ప్రభుత్వాలు పట్టా పాస్న?బుక్ లు రైతులకు జారీ చేయకుండా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. ఇట్టి విషయంలో అందోల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వైద్య ఆరోగ్యాశాఖ మంత్రి దామోదర రాజనరసింహ గారు ఎన్నికల సమయంలో స్వయంగా అందోల్ గ్రామంలో అందరి సమక్షంలో రైతులకు పట్టాలు ఇప్పించే బాధ్యతలు నాది అని హామీ ఇవ్వడం జరిగింది.హామీ ఇచ్చి దాదాపు సంవత్సరాలు గడుస్తున్నా, ఇంతవరకు న్యాయం చేయలేక పోయారు ఇప్పటికైనా మంత్రి గారు రైతులకు పట్టపాసు పుస్తకాలు ఇప్పించి న్యాయం చేయాలనీ ఎం ఆర్ పి ఎస్ తరపున విజ్ఞప్తి చేస్తున్నాము.ప్రభుత్వ అధికారులు కూడా రైతులకు పట్టపాసు పుస్తకాలు ఇప్పించే విషయంలో సహకరించి న్యాయం చేయాలనీ విజ్ఞప్తి చేస్తున్నాం.లేనిపక్షంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు రైతుల పక్షాన న్యాయం కోసం ఎంతటి పోరాటానికైనా సిద్దంగా ఉంటామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలోగంధగల్ల వీరయ్య మాదిగ ఎమ్మెస్పీ జిల్లా నాయకులు,పుర్ర సంతోష్ మాదిగ అందోల్ నియోజకవర్గ ఇంచార్జి,పెద్దమదిగా అశోక్ ఎం ఆర్ పిఎస్ వట్పల్లి మండల అధ్యక్షులు,భాంధవ్,తుడుం రాములు మాదిగ,మహేష్,రాకేష్, జ్ఞానమ్మ,రాజు,రవి, బాధిత రైతులు పాల్గొన్నారు.

# ప్రజలకు ప్రభుత్వానికి వారధి జర్నలిస్టులు జోగిపేట మార్కెట్ కమిటీ చేర్మన్ మక్త జగన్మోహన్ రెడ్డి

ప్రజాదివాస్



అందోల్ నియోజకవర్గం వట్పల్లి మండల్ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండి ప్రజల సమస్యలు ప్రభుత్వానికి తెలియజేసి తీర్చే శక్తి ఒక్క జర్నలిస్టులకే ఉంటుందని ఆందోల్ మార్కెట్ కమిటీ చేర్మన్ మక్త జగన్మోహన్ రెడ్డి అన్నారు.ఉమ్మడి మెదక్ జిల్లా (టీ డబ్ల్యూ జె ఎ )తెలంగాణ జర్నలిస్టుల వెల్ఫర్ అసోషియేషన్ జనరల్ బాడీ సమావేశం వట్ పల్లి మండలం మరవెల్లి గ్రామంలోని ప్రయివేట్ ఫంక్షన్ హాల్ లో జరిగింది.ముఖ్య అతిథిగా చేర్మన్ జగన్మోహన్ రెడ్డి,నేరడిగుంట మాజీ సర్పంచ్ చందులత వీరమల్లప్ప, పట్లోళ్ల రాజు పటేల్,ఆందోల్ మండలం యూత్ ఐకాన్ పృథ్విసాగర్ రెడ్డి,హాజరై జర్నలిస్ట్ ల సమస్యలపై ప్రసంగించారు.జర్నలిస్టుల సమస్యలను మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లి పరిస్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో( టీ డబ్లు జె ఎ) ఫౌండర్ శక్తి వెంకటేశం,అమృత మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల కోసం వారికి తగిన న్యాయం చేయడానికి ఈ యూనియన్ ని ఏర్పాటు చేయడం జరిగిందని వారి కోసం అహర్నిశలు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జర్నలిస్టులతో పాటు మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు మిద్దెల గాలిరెడ్డి,గొల్ల నాగేందర్ యాదవ్,ఎర్రోళ్ల జోగినాథ్, వరప్రసాద్,బాగయ్య,కుమ్మరి సంగమేష్,డప్పు శంకరయ్య,మన్నే కిష్టయ్య,ఆందోల్ మధు,జహీరాబాద్ నర్సింలు,దడికె అంజి,జిల్లాలోని ప్రముఖ జర్నలిస్టుల నాయకులు పాల్గొన్నారు.

# దమ్మపేట మండల ఎంఆర్పిఎస్ కమిటీ ఎన్నిక

ప్రజాదివాస్

దమ్మపేట మండల విలేకరుల సమావేశం ఈ సమావేశం లో ఎం ఆర్ పి ఎస్ స్టేట్ సెక్రటరీ మండల ఇంచార్జి కొలికపోగు కాంతారావు మాదిగ మాట్లాడుతూ ఈ నెల సెప్టెంబర్ 9,10 లలో వరంగల్ మేడారంలో జరుగు ఎం ఆర్ పి ఎస్ .ఎం ఎస్ పి ల జాతీయ సదస్సులను జయప్రదం చేయడానికి సిద్ధం కండి.2) డ్రెస్ కోడ్ సమయం క్రమశిక్షణకు వందకు వందశాతం కట్టుబడి వచ్చిన వారిని మాత్రమే సభా ప్రాంగణంలోకి ఆహ్వానం ఉంటుంది 3) నూతన మండల కమిటీల ప్రక్రియను 100కు 100% పూర్తిచేసుకుని అక్టోబర్ 7న అమరావతిలో జాతీయ సదస్సు జరుపుకుందాం.4) ఎం ఎస్ ఎఫ్. ఎం ఎం ఎస్ , ఎం ఎం. ఎం.ఎం ఈ ఎఫ్ లతో బాటు ప్రతి అనుబంధ విభాగాలకు జరిగే నూతన నిర్మాణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి 5) తెలుగు రాష్ట్రాలకు దక్షిణాదికి దేశానికి ఒక దిక్సూచిలా మన పోరాటాలను నిర్మిద్దాం 6) ప్రజా పోరాటాలకు మనమే నేతృత్వం వహిద్దాం



రాజకీయ చైతన్యంతో మన పీడితులను కూడగడుదాం.6) సాంఘికంగా ఆర్థికంగా మతపరమైన వివక్షతలు అలిచివేతలు లేని నవ సమాజ నిర్మాణం కై జరిగే పోరాటానికి అగ్రభాగాన నిలబడదాం. దమ్మపేట మండల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది మండల అధ్యక్షుడు గా కొలికపోగు క్రాంతి కుమార్ మాదిగ ,ఉప అధ్యక్షుడు దాట్ల అశోక్ మాదిగ ప్రధాన కార్యదర్శిగా కౌలురి నాగేశ్వరరావు, అధికారి ప్రతినిధి గా కొలికపోగు వరప్రసాదరావు మాదిగ ,సహాయ కార్యదర్శి గా సంఘసాని రాంబాబు, కార్యదర్శి గా లంక రామక్రిష్ణ మాదిగ,శ్రీను మాదిగ,జన్నునూరి ముత్యాలరావు,దార్ల సాయి మాదిగ ,నారపోగు అరవింద్ మాదిగ, ముఖ్య సలహాదార్లుగా ఎం ఆర్ పి ఎస్ సీనియర్ నాయకులు పుల్లారావు,వీరయ్య,ముసలయ్య,వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.